ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి



RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు



NO SMOKING ALCOHOL
SAY NO TO DRUGS



Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 60 బుధవారం 11 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-



Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 60 Wednesday 11 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## హైదరాబాద్ శివారులో
# భూప్రకంపనలు




- బయటకు పరుగుతీసిన ప్రజలు
- ఉదయం 10:10 గంటలకు కంపించిన భూమి
- భూప్రకంపనలా లేక పేలుడు జరిగి కంపించిందా అనేదానిపై అస్పష్టత
- సంఘటన స్థలానికి చేరుకున్న సంబంధిత అధికారులు

## సీఎం రేవంత్ రెడ్డికి
# బండి సంజయ్ బహిరంగ లేఖ

- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా వేదనకు గురి చేయడం సరికాదన్న బండి సంజయ్
- ప్రభుత్వం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన
- హైదరాబాద్ నడిబొడ్డున ఆందోళన, దీక్ష చేస్తామని హెచ్చరిక



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం సరికాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. పదవీ విరమణ చేసి రెండేళ్ల యినా బెనిఫిట్స్ బకాయిలను చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. రిటైర్డ్ అయ్యాక ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మానసిక వేదనకు గురి చేస్తుండటం క్షమించరాని నేరమని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే బెనిఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. తక్షణమే వారి బకాయిలను - మిగతా 2 లో

## రూ.1,511 కోట్ల విలువైన
# భూమిని కాపాడిన హైడ్రా

- హైదరాబాద్‌లో కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా
- ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు
- కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా
- అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు
- రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా
- జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ. 1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన - మిగతా 2 లో





# వాయుసేనకు 114 కొత్త రఫేల్స్

- రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!
- భారత వాయుసేన కోసం 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు రంగం సిద్ధం
- రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందానికి త్వరలో రక్షణ శాఖ ఆమోదం
- ఒప్పందంలో భాగంగా సుమారు 100 యుద్ధ విమానాల దేశీయ తయారీ
- హైదరాబాద్‌లో టాటా సంస్థ ఆధ్వర్యంలో కీలక భాగాల ఉత్పత్తి

## అవిశ్వాసం తేలేదాకా
# కుర్చీ ఎక్కను

- స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!
- లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్షాల అవిశ్వాస తీర్మానం నోటీసు
- ఈ విషయం తేలేదాకా విధులకు దూరంగా ఉంటానన్న ఓం బిర్లా
- ఇది తన నైతిక బాధ్యత అని, చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేసిన స్పీకర్
- మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(C) కింద ఈ నోటీసును సమర్పించాయి
- సుమారు 120 మంది విపక్ష ఎంపీల సంతకాలు




**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 10 :** లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(C) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు - మిగతా 2 లో

## వ్యవసాయాన్ని
# మరో స్థాయికి తీసుకెళతాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్ర సహకారంతో వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు సలహాలు కోరానన్న సీఎం
- దేశ వ్యవసాయ జీడీపీలో ఏపీ వాటా దాదాపు 10 శాతం అని వెల్లడి
- ఏపీ అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేంద్రమంత్రి ఆదేశం
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారిందన్న శివరాజ్ సింగ్



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 10 :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని మరో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంగళవారం సమావేశమయ్యారు. - మిగతా 2 లో




## లిబియా తీరంలో వలసదారుల పడవ మునక..
# 53 మంది మృతి

- లిబియా తీరంలో రబ్బరు బోటు బోల్తా
- 55 మంది వలసదారులలో 53 మంది మృతి
- మృతుల్లో ఇద్దరు పసిపిల్లలు కూడా ఉన్నట్లు వెల్లడి
- ఈ ఏడాది మధ్యధరా సముద్రంలో 500 మంది మరణించినట్లు ఐఓఎం అంచనా
- లిబియాలో నెలకొన్న అరాచకమే కారణమంటున్న నిపుణులు

## సభకు రాకపోవడం
# ప్రజలను అవమానించడమే



- వైసీపీపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ఫైర్
- వైసీపీ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తీవ్ర విమర్శలు
- చర్చలకు బదులు అరాచకానికే వైసీపీ అలవాటుపడిందని వ్యాఖ్య
- 151 నుంచి 11 సీట్లకు పడిపోవడమే వైసీపీ పాలనకు నిదర్శనం
- 22-ఏను అడ్డుపెట్టుకుని రైతులను వైసీపీ ప్రభుత్వం వేధించిందన్న కాల్వ

**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 10 :** శాసనసభ చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అవమానించడమేనని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం - మిగతా 2 లో

## విశాఖ మెట్రోకు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్

- 46.22 కి.మీ - 43 స్టేషన్లు
- విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్
- విశాఖ మెట్రో మొదటిదశ ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్లు ఖర్చు
- మెట్రోను మొదటి దశలో 3 కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ సిద్ధం
- 3 కారిడార్లలో కలిపి మొత్తం 46.22 కి.మీ, 43 మెట్రో స్టేషన్లు
- విశాఖ, విజయవాడలో మెట్రోకు ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ ప్రతిపాదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్య విధానంలో ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెల్లింపు



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 10 :** విశాఖ మెట్రో రైలుకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి మనోహర్ లాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ లాల్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ, విజయవాడ మెట్రోకు ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో మెట్రోకు పచ్చజెండా ఊపినట్లు సీఎంకు కేంద్రమంత్రి తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఈ మెట్రో ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగనుంది. విశాఖ మెట్రో మొదటిదశ ప్రాజెక్టుకు రూ. 11 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మెట్రోను మొదటి దశలో 3 కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ సీద్ధం చేశారు. 3 కారిడార్లలో కలిపి మొత్తం 46.22 కి.మీ, 43 మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు. అలానే ఈ మెట్రో ప్రాజెక్టును డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టులో ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాక వద్ద ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.

కూర్మన్నపాలెం-కొమ్మాది జంక్షన్ మధ్య మొదటి మెట్రో లైను 34.4 కి.మీ, 29 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.

గురుద్వారా-పాత పోస్టాఫీసు మధ్య 2వ మెట్రో లైను రానుంది. ఈ కారిడార్‌లో - మిగతా 2 లో

## పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను ఉచితంగా పంపిణీ చేసిన జడ్పీటీసీ బైసాని జ్యోతి..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) –** : పదవ తరగతి పరీక్షల్లో హాజరుకానున్న విద్యార్థుల కోసం వారి ప్రయోజనర్థం "సాక్షి " ముద్రించిన స్టడీ మెటీరియల్ ను తంబళ్లపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు కురబలకోట జడ్పీటీసీ బైసాని జ్యోతి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ బైసాని జ్యోతి మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ ను క్షుణంగా అనుభవజ్ఞులైన నిపుణులచే రూపొందించబడిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని ఈసారి పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు బాగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని బైసాని జ్యోతి కోరారు. పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఉజ్వల భవిత సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇందుకు "సాక్షి" స్టడీ మెటీరియల్ దోహదం చేస్తుందని వెల్లడించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు వెంకట శివయ్య, గంగాధర్, పీడీ మహేంద్ర, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, యువ నాయకులు శెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు..

## గత ప్రభుత్వ ఏళ్ల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిన రోడ్లు

**ఎమ్మెల్యేకు ప్రజలే చెప్పిన తిరువూరు నియోజకవర్గ నిజాలు**

**35 గ్రామాల పర్యటనలో ప్రజల రోడ్ల సమస్యలు.. వందల కొద్దీ అర్జీల తో ఆవేదన**



**తిరువూరు ఫిబ్రవరి 10 (వార్తసంధ్య)** : తిరువూరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై ప్రజల ఆవేదన మరోసారి బయటపడింది. గంపలగూడెం మండలం ఆర్లపాడు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కలిసి, గ్రామంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమై అభివృద్ధి మాటలు అర్థం లేనివిగా మారాయని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో మూడు రోజులపాటు 35 గ్రామాలు పర్యటించిన సమయంలో కేవలం ఆయనే గమనించినదే కాకుండా, ప్రజలే స్వయంగా ముందుకొచ్చి తమ గ్రామాల్లో రోడ్ల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. లక్ష్మీపురం, రాయుగూడెం, కోకిలంపాడు, తిరువూరు, పీటీ కొత్తూరు, చింతలపాడు, కొమ్మిరెడ్డిపల్లి, వావిలాల, ఊటుకూరు, సత్యాలపాడు, విస్సన్నపేట తదితర గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణీలు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, కొన్ని గ్రామాలకు ఆటోలు కూడా రావడం లేదని మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆర్లపాడు గ్రామంలో గత 22 ఏళ్లుగా రోడ్డు సమస్య అలాగే కొనసాగుతుండటం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామ నాయకులు విమర్శించారు. ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే, తిరువూరు నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రోడ్లు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి, పెండింగ్ రోడ్లన్నింటికీ నిధులు మంజూరు చేయించి కూటమి ప్రభుత్వ సహకారంతో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## కర్లపాటి సేవలు ఆదర్శప్రాయం తన్నీరు నాగేశ్వరరావు



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని,గత రెండున్నర దశాబ్దాలుగా జగ్గయ్యపేట ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కర్రపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకట శ్రీనివాసరావు అభినందనీయులని వైఎస్ఆర్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరావు అన్నారు. ఇటీవల రెండు ప్రతిష్టాత్మక గుర్తింపులు పొందిన సందర్భంగా కర్లపాటిని ట్రస్ట్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ట్రస్టు నాణ్యత నిర్వహణ వ్యవస్థకు ఐ ఎస్ ఓ గుర్తింపు, అంబుడ్స్ పర్సన్ ఎంజి నరేగా గా విశిష్ట సేవలు అందించి మెరిటోరియస్ అవార్డును పొందిన నేపథ్యంలో కర్లపాటిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో శ్రీనివాస్ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ప్రజల హక్కుల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ ఈ గుర్తింపు వ్యక్తిగత గౌరవంగా కాకుండా సమాజ సేవకు ప్రజా సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని అన్నారు. తన్నీరు నాగేశ్వరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ కు లభించిన ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్ తమ బాధ్యతను మరింత పెంచిందని ఇది నాణ్యత, పారదర్శకత , ప్రజల పట్ల జవాబుదారీతనంతో ముందుకు సాగాలని స్పష్టమైన దిశను చూపిం చిందన్నారు. అంబుడ్స్ పర్సన్ గా లభించిన అవార్డు తాను చేసిన పనికి మాత్రమే కాదని గ్రామీణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అందించిన గౌరవంగా భావిస్తున్నానీ తెలిపారు. రాజకీ యాల కతీతంగా ప్రభుత్వాలతో కలసి ప్రజల కోసం పని చేయాలన్నదే తమ సిద్ధాంతమని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కర్లపాటి రాజారావు రాయపూడి వెంకటేశ్వరరావు, నాయకులు నరసింహారెడ్డి,బెడదం సత్యనారాయణ పఠాన్ ఫిరోజ్ ఖాన్ పలువురు పాల్గొని కర్లపాటిని అభినందించారు.

## స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎం& హెచ్ఓ డా. తుకారం రాథోడ్

**యేదురుగడ్డ హేమచంద్రాపురం కుష్టు కాలనీ, ఎస్టీ వినస్ హై స్కూల్ సందర్శన**

**రోగులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10(వార్త సంధ్య) :** స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డీఎం& హెచ్ఓ) డా. తుకారం రాథోడ్ ఎదురుగడ్డ, హేమచంద్రాపురం గ్రామాల్లోని కుష్టు కాలనీ ని సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ ఫోటోకు పుష్పాంజలి ఘటించి, కుష్టు వ్యాధి నివారణ, వికలాంగతలను తగ్గించే విధానాలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం కుష్టు రోగులకు సెల్ఫ్ కేర్ కిట్లు, వీజ= చెప్పులు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఎదురుగడ్డ ఎస్టీ వినస్ హై స్కూల్ను సందర్శించిన డా. తుకారం రాథోడ్ గారు విద్యార్థులకు సమతుల ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, "ఈట్ రైట్ & డ్రింక్ రైట్", సరైన చేతులు కడుక్కోవడం పై అవగాహన కల్పించారు. జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న అల్బెండాజోల్ మాత్రలను ప్రతి పిల్లవాడు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీకి హాజరుకానున్న వైయస్ జగన్ టీం..

**- తమ పార్టీ నేతల ఇళ్ల పై జరిగిన దాడుల పైన నిరసనకు దిగాలని డిసైడ్..**





**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) –** : సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కాబట్టి తొలి రోజున గవర్నర్ ప్రసంగంతో సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశాలకు వైసీపీ హాజరు పైన కొద్ది రోజులుగా చర్చ జరుగుతోంది. తాజాగా పార్టీ నేతలతో భేటీ సమయంలో జగన్ సభకు హాజరు పైన స్పష్టత ఇచ్చారు. జగన్ తో పాటుగా ఎమ్మెల్యేలు సభకు హాజరు కానున్నారు. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కాగా వైసీపీ ఇదే సమయంలో మరో ఆసక్తి కర నిర్ణయం తీసుకుంది. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి జగన్ టీం సమావేశం లో పాల్గొనాలని భావిస్తున్నారు. ఆ తరువాత బీఏసీ సమావేశంలో సభ నిర్వహణ అజెండా ఎన్ని రోజులు సమావేశాలు కొనసాగించాలనేది నిర్ణయించనున్నారు. మాజీ సీఎం హోదాలో జగన్ వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి పైన శాసనసభా వర్గాలను వైసీపీ నేతలు ఆరా తీసినట్టు తెలిసింది. ఇందుకు శాసనసభ వర్గాలు కూడా సుముఖతను వ్యక్తం చేసినట్టు సమాచారం. 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, గవర్నర్ ప్రసంగ కార్యక్రమాల కోసం అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చారు. ఆ తర్వాత నుంచి శాసనసభా సమావేశాలను బాయ్‌కాట్ చేస్తూ వస్తున్నారు. వైసీపీకి ప్రతి పక్ష హోదా ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పార్టీ నేతలతో జగన్ కీలక సమావేశం..

గవర్నర్ కు గౌరవం ఇచ్చేలా ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఓడిన తరువాత గవర్నర్ ప్రసంగానికి మాత్రం హాజరవుతున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిరసనకు దిగే అవకాశం కనిపిస్తోంది. తమ పార్టీ నేతల ఇళ్ల పైన జరిగిన దాడుల పైన నిరసనకు దిగాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశం తరువాత పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో జగన్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. భవిష్యత్ కార్యాచరణ పైన దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా ఎమ్మెల్యేల గైర్హాజరు పైన కూటమి నేతలు వరుసగా విమర్శలు చేస్తున్నారు. సభకు హాజరు కాకుండానే జీత భత్యాలు తీసుకొంటున్నారని వారి పైన చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటు ప్రభుత్వం పైన రాజకీయం గానూ ఒత్తిడి పెంచే వ్యూహాలతో జగన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో పార్టీ నేతల సమావేశంలో జగన్ ప్రకటించే నిర్ణయాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది..

# ఉల్లిపాయల మాటున గంజాయి స్మగ్లింగ్..

**గుట్టురట్టు చేసిన అన్నమయ్య జిల్లా పోలీసులు..!**

**రూ. 44.65 లక్షలు విలువ చేసే సుమారు 179 కేజీల గంజాయి స్వాధీనం..**

**ఒక ఆటో, ఇద్దరు నిందితుల అరెస్ట్ మరో నలుగురి కోసం గాలింపు..**





**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) –** : జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసు యంత్రాంగం మరో భారీ గంజాయి స్మగ్లింగ్‌ను ఛేదించింది. ఉల్లిపాయల వ్యాపారం ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముఠాను మదనపల్లె తాలూకా పోలీసులు గుట్టు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో మదనపల్లె తాలూకా ఇన్స్ పెక్టర్ కళా వెంకటరమణ మరియు సిబ్బంది మదనపల్లె – తిరుపతి ప్రధాన రహదారిలోని యర్రగానిమిట్ట వద్ద పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా లగేజీ ఆటోను తనిఖీ చేశారు. పైన ఉల్లిపాయల బస్తాలను పేర్చారు. పోలీసులకు అనుమాన మొచ్చి విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఉల్లిపాయలను కిందకు దింపి చూస్తే పోలీసులకు మైండ్ బ్లాక్ అయింది. ఉల్లిపాయల కింద తొమ్మిది బస్తాల్లో దాచిన దాదాపు 179 కేజీల గంజాయి బయటపడింది. పైగా ఆటోకు నెంబర్ కూడా లేదని గుర్తించారు. దీని విలువ సుమారు రూ. 44 లక్షల 65 వేలు ఉంటుందని అంచనా వేశారు.

అరెస్టయిన నిందితులు..

పోలీసులు నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించి వారి వివరాలను వెల్లడించారు. ఆవుల నాగరాజ (23) ఆటో డ్రైవర్, చంద్ర కాలనీ ఆవుల సుగుణ (29) చంద్ర కాలనీ ఇద్దరిని మదనపల్లి వాసులుగా గుర్తించారు. వీరిపై మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో జతీఅఎవ చీశీ. 49/2026 (ఎన్డీ పీఎస్ యాక్ట్) కింద కేసు నమోదు చేశారు. ఈ ముఠాలో ఉన్న మరో నలుగురు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు.

యువత భవిష్యత్తుతో ఆడుకుంటే కఠిన చర్యలు – ఎస్పీ హెచ్చరిక..


ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ "మదనపల్లె పరిసర ప్రాంతాల్లో యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామని గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని ప్రజలు కూడా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడంలో సహకరించాలని కోరారు. భారీ గంజాయిని పట్టుకున్న మదనపల్లె తాలూకా పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు..

# శివ స్వాములపై పోలీసుల లాఠీ జూలం..

**- కనీసం తాగేందుకు కూడా నీరు అందుబాటులో లేదని ఆగ్రహం..**

**- వీఐపీలకు అంత ప్రాముఖ్యమా..!**





**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) –** :మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీశైలం ఆలయంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది శివ భక్తులు పోటెత్తారు. జనసమూహాన్ని అదుపు చేయడానికి పోలీసులు శివ భక్తులపై లాఠీలను జులిపించారు. లాఠీలతో కొడుతూ భయభ్రాంతులకు గురి చేశారు. శివ భక్తులని మరచి పోలీసులు లాఠిఛార్జ్ చేయడంతో మల్లన్న క్షేత్ర ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఐదు గంటల నుంచే భక్తులు, శివస్వాములు క్యూలైన్లలో వేచి ఉన్నారు. గంటలు గడుస్తున్నా క్యూ లైన్‌లు ముందుకు జరగలేదు. దీంతో భక్తుల్లో అసహనం మొదలైంది. కనీసం తాగేందుకు కూడా నీరు



అందుబాటులో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనం కోసం ఎదురుచూసే కొందరు భక్తులు ఉక్కపోత, నీరసంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని భక్తులు ఆరోపించారు. ఆలయ ఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు ముందస్తు ఏర్పాట్లను చేయలేదని శివ భక్తులు మండిపడ్డారు. వేలాది మంది భక్తులు, ముఖ్యంగా శివ దీక్ష తీసుకున్నవారు తెల్లవారుజాము నుండే ఆలయం వద్దకు చేరుకున్నారు. కొంత మంది భక్తులు ముఖ్యంగా శివ స్వాములు క్యూ లైన్లలో ఎక్కువసేపు వేచి ఉండటంతో ఆందోళనకు గురై ఆలయ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిలో కొందరు బారికేడ్లను దాటి ఆలయ ద్వారాల వైపు చొరబడేందుకు

కాసేపటికే పరిస్థితి చేయిదాటి పోయింది. శివస్వాములు క్యూలైన్ల నుంచి బయటకు వచ్చి నిరసన తెలియజేశారు. దీంతో మల్లన్న ఆలయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఎస్పీ సునీల్, ఏఎస్పీ యుగంధర్ బాబు రంగంలోకి దిగారు. భక్తుల ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పోలీసులు అదుపుచేసేందుకు స్వల్ప లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ఏఎస్పీ యుగంధర్ బాబు లాఠీతో భక్తులను బెదిరిస్తూ, వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసినట్టుగా వీడియోలో కనిపిస్తుంది. శివస్వాములపై పోలీసులు లాఠీలు లేపడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇక చేసేదేమీ లేక చాలా మంది శివస్వాములు రాజగోపురం నుంచే స్వామి వారిని దర్శనం చేసుకోకుండానే వెనక్కు తిరిగారు.




యత్నించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వీఐపీలకు ప్రాధాన్యత ఇస్తూ తమను గంటల తరబడి వేచి ఉండమని బలవంతం చేశారని శివ స్వాములు ఆరోపించారు. శ్రీశైలం ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు క్యూ లైన్ల వద్దకు చేరుకుని ఆందోళన చెందుతున్న భక్తులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. 11 రోజుల బ్రహ్మోత్సవాలలో మొదటి ఐదు రోజుల్లో శివ దీక్ష భక్తులకు మాత్రమే స్పర్శ దర్శనం అనుమతిస్తామని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. ఇతర భక్తులకు కూడా దర్శనం కల్పించడానికి శివ దీక్ష భక్తులను రెండు గంటల పాటు నిలిపివేస్తారు. ఈ ప్రక్రియలో కొంత మంది భక్తులు అసహనానికి గురై గొడవ పడ్డారని అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ నిర్వహణకు సహకరించాలని, ఓపికగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శివ స్వాములు పోలీసుల వైఖరిని తప్పుపడుతూ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికని దూర ప్రాంతాల నుంచి వచ్చామని మమ్మల్ని టెర్రరిస్టులాగా భావించి లాఠిచార్జ్ చేయడమేంటని శివ స్వాములు ప్రశ్నించారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం అవుతున్న క్యూలోనే వేచి ఉన్నామని తిండి తిప్పలు లేక చిన్న పిల్లలు అల్లాడుతున్నారని ఇంత దరిద్రమైన పాలకమండలిని ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని శివ స్వాములు కన్నేరా చేశారు.

## జిల్లాలో ఫిబ్రవరి 20 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

**పత్తి రైతులు ఎంఎస్పీని సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 202526 సీజన్‌కు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఈ నెల ఫిబ్రవరి 20, 2026 వరకు కొనసాగనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలోని పత్తి రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని సద్వినియోగం చేసుకొని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తమ పత్తిని విక్రయించుకోవాలని ఆయన సూచించారు. సీసీఐ ద్వారా ఇప్పటికే కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ కావడంలో కొంత ఆలస్యం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 21, 2026 నుంచి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేయబడతాయని, మిగిలిన కాలవ్యవధిని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

## చనమోలు వెంకట్రావు సేవలు స్ఫూర్తిదాయకం.

**ఇబ్రహీంపట్నంలో ఘనంగా చనమోలు వెంకట్రావు జయంతి**




**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 వార్త సంధ్య :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు స్వర్గీయ చనమోలు వెంకట్రావు 94వ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లోని వెంకట్రావు విగ్రహమునకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. చనమోలు వెంకట్రావు సేవలు స్ఫూర్తిదాయకం అంటూ ఈ సందర్భంగా వెంకట్రావు మైలవరం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని కొనియాడారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు ఝాన్సీ, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు శ్రీనివాస్ , కౌన్సిలర్లు చనమోలునారాయణ , మైలా సైదులు , విఘ్నేశ్వర రావు , రావి ఫణి , ఇబ్రహీంపట్నం పిఎసిఎస్ చైర్మన్ కోయ నెహ్రూ , స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటరావు అభిమానులు సానుభూతిపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## పంటలు ఎండిపోతున్నాయి నీళ్లివ్వండి అన్నదాతల ఆవేదన



**కృష్ణాజిల్లా బ్యూరో,ఫిబ్రవరి 10, వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని, ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు రైతులకు శాపంగా మారిన ఎన్ఎస్పి అధికారుల నిర్లక్ష్య వైఖరి ఆంధ్ర,తెలంగాణా సరిహద్దు రైతులకు శాపంగా మారింది.వత్సవాయి మండలంలో ఆంధ్ర తెలంగాణ సరిహద్దు రైతులు ఎన్ఎస్పికి కెనాల్ ద్వారా సుమారుగా 25 వేల ఎకరాల ఆయకట్టు సాగు చేస్తూ ఉన్నారు.ఎక్కువ విస్తీర్ణములో మొక్కజొన్న పంట సాగు చేశారు.వంట చివరిదశకు వచ్చింది.ఈ దశలో సాగునీరు ఇవ్వకపోతే తమకు ఆత్మహత్యే దిక్కని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాములూరు మేజర్ కెనాల్ చివరి వరకు సాగునీరు అందట్లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆంధ్ర వైపు ఆంధ్ర రైతులు తెలంగాణ వైపు తెలంగాణ రైతులు అంతరాష్ట్ర రహదారిపై మంగళవారం ఈ సమస్యపై తమ తమ సరిహద్దు ప్రాంతాల్లోని రోడ్లపై నిరసన తెలియజేశారు.ఎన్ఎస్పి అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని వెంటనే అధికారులు నీరు ఇవ్వకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని చివరి పంట భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆంధ్ర ఎన్ఎస్పి అధికారులు తెలంగాణ ఎన్ఎస్పి అధికారులతో మాట్లాడారు.దీనిపై తెలంగాణా అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వడ్లమూడి రాంబాబుదాములూరు డిసి చైర్మన్ చిట్టూరి సుభాష్, వత్సవాయి సొసైటీ అధ్యక్షులు నెల్లూరు శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు మండేపూడి చంద్రశేఖర్, చిరుమామిళ్ల హనుమంతరావు, పెద్ది రామారావు, ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు చిత్తూరు రమేష్, తాళ్లూరు జనార్ధన్, బి.రాము, బోల్లా శ్రీనివాసరావు,కోటేశ్వరరావు, ఎస్ కృష్ణవేణి, జి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## హెత్విక జన్మదినాన మానవత్వానికి ప్రతీకగా పరిపూర్ణ బాల బాలికల ఆశ్రమం లో అన్నదానం




**తిరువూరు ఫిబ్రవరి 10 (వార్తసంధ్య) :** యన్ టీ ఆర్ జిల్లా స్థానిక తిరువూరు బైపాస్ రోడ్డులో గల పరిపూర్ణ ఆశ్రమంలో గంపలగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గువ్వల శ్రావణి, తియ్యగూర హేమంత్ దంపతుల కుమార్తె చిరంజీవి హెత్విక పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తమ కుమార్తె జన్మదినాన్ని ఆర్భాటాలకంటే సేవా భావంతో జరపాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన దంపతులు, ఆశ్రమంలోని చిన్నారులకు ప్రేమతో అన్నదానం చేశారు. అన్నదానం అనంతరం చిన్నారులకు స్వీట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేయగా, ఆ వాతావరణం అంతా చిన్నారుల నవ్వులతో, ఆనందంతో నిండిపోయింది. ఆశ్రమంలో గడిచిన ప్రతి క్షణం మానవత్వానికి అద్దం పట్టేలా ఉండగా, పరిపూర్ణ బాల బాలికల ఆశ్రమంలోని చిన్నారులు చిరంజీవి హెత్వికకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ చిన్న చేతుల ఆశీర్వాదాలు, చిరునవ్వులు ఆ రోజు ప్రత్యేకతను మరింత పెంచాయి. ఈ సందర్భంగా పరిపూర్ణ ఆశ్రమ నిర్వాహకులు సిరికొండ నాగేశ్వరరావు (అభి), వరలక్ష్మి గార్లు మాట్లాడుతూ, గువ్వల శ్రావణితియ్యగూర హేమంత్ దంపతులు చేసిన సేవను కొనియాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆశ్రమం తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. హెత్విక పుట్టినరోజు కేవలం ఒక కుటుంబ ఆనందంగా మాత్రమే కాక, చిన్నారుల జీవితాల్లో ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. సేవతో పుట్టినరోజును అర్థవంతం చేసిన ఈ కుటుంబం, సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించింది.

## సచివాలయ నగర్ కాలనీలో 64.00 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం

### - బి.యన్ రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 10:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ కాలనీలో 64.00 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన సి.సి రోడ్లును బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం కొరకు 64.00 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అట్టి రోడ్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని త్వరలోనే కాలనీలోని మిగతా రోడ్లు కూడా నిర్మించుకునే విధంగా చర్యలు చేపడతామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పింగళి. సంబశివారావు,గుత్తబాలిరెడ్డి ,ఆంజనేయులు ,కూర్మారావు ,హనుమంత్ రావు ,చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్,బాబురావు,నరసిమమ్, హరీష్,శ్రీధర్, సుధీర్ కుమార్ విజయ్,ఫణి,రాజు,జనార్ధన్,రవికుమార్,హర గోపాల్,సీతారామ శాస్త్రీ,లక్ష్మి జ్యోతి,శ్యామ్,మాధవరావు, మధుసూదన్ రెడ్డి ,సంబశివారావు,శేషు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 10:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి భాగంగా 68.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మరియు 10 లక్షల రూపాయల వ్యయంతో పార్క్ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. “కమలానగర్ కాలనీ అభివృద్ధికి ఎప్పటి నుంచో ప్రత్యేక దృష్టి పెట్టాం. రోడ్లు, డ్రైనేజ్, పార్కులు, ఇతర మౌలిక వసతులన్నీ దశలవారీగా పూర్తి చేస్తున్నాం. ప్రజలకు మెరు గైన జీవన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం. అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయి” అని తెలి పారు.

**కాలనీ వాసులు మాట్లాడుతూ..**

“గత ఐదు సంవత్సరాల్లో కమలానగర్‌లో రెండు కోట్లకు పైగా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజ్, పార్కులు మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మా కాలనీ రూపురేఖలు మార్చిన కార్పొరేటర్ కి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. మా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న ఆయనకు రానున్న రోజుల్లో కూడా మేమంతా అండగా ఉంటాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టి.వి రావు, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పుల్లమ్మ, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు ఉపేందర్, సంక్షేమ సంఘం సభ్యులు సుబ్బా రావు, మల్లికార్జున్, మరియు కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 10:** ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బ్లడ్ బ్యాంక్ కాలనీలో చాలా కాలంగా మురుగు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో మరింత సమస్యలు ఏర్పడి దుర్వాసనలు, దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతోనే దాదాపు 43 లక్షల 50 వేల రూపాయల నిధులు మంజూరు చేయించి భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించామని చెప్పారు. పనులు పూర్తయిన తర్వాత కాలనీ పూర్తిగా పరిశుభ్రంగా మారి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. అదేవిధంగా హయత్ నగర్ డివిజన్ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని ఒక పదవిగా కాకుండా గొప్ప బాధ్యతగా భావించి గత ఐదు సంవత్సరాలుగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రతి సమస్యను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే దిశగా పనిచేశానన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, వివిధ సంఘాల భవనాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో పనులు చేపట్టి డివిజన్ అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఇదే సేవాభావంతో ముందుకు సాగుతూ ప్రతి కాలనీ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సేవే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కాలనీ అధ్యక్షులు బన్సోత్ భాగ్య నాయక్, కాలనీ సంక్షేమ సంఘం మురళీధర్ రెడ్డి, నరసింహ గౌడ్,కళ్యాణ్ రెడ్డి, మల్లేష్ గౌడ్ మరియు కాలనీవాసులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# “ధ్వంసం చేసిన వారికి స్టేషన్ బెయిల్..

- విమర్శించిన వారికి జైలు.. ఉండవల్లి అరుణ్ కుమార్
- చంద్రబాబు కొత్త ఒరవడికి శ్రీకారం..
- కక్ష సాధింపనేది క్లియర్ గా తెలిసిపోయిందని విమర్శలు..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) – :** మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ నేత అంబటి రాంబాబును మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మంగళవారం కలిశారు. రాజమండ్రి జైలులో అంబటితో ఉండవల్లి అరణ్‌కుమార్, మాజీ మంత్రి కన్నబాబు, మోదుగుల వేణుగోపాలకృష్ణ ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వెలుపల ఉండవల్లి మీడియాతో మాట్లాడారు. అంబటి రాంబాబు 1989లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసినప్పటి నుంచీ తనకు పరిచయమని ఉండవల్లి తెలిపారు. వ్యక్తిగత పరిచయంతోనే ఆయనను కలవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఏపీలో కొత్త పద్ధతి నడుస్తుందని ఆరోపించారు .“ధ్వంసం చేసిన వారికి స్టేషన్ బెయిల్. విమర్శించిన వారికి జైలు. పెట్రోల్ బాంబులతో దాడులు చేసిన వారికి బెయిల్ ఇవ్వడం దారుణమని జైల్లో వేయడం, 30 చోట్ల నుంచి కంప్లైంట్‌ల పెట్టడం దారుణమని చంద్రబాబు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని కక్ష సాధింపనేది క్లియర్ గా తెలిసిపోయిందని ఉండవల్లి పేర్కొన్నారు. రాజకీయంగా వైసీపీ తో ఏదైనా గొడవ ఉంటే చంద్రబాబు చూసుకోవాలన్నారు. అంతేగాని లడ్డూ ప్రసాదం పై నీచమైన వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. లడ్డూ ప్రసాదం లో పంది కొవ్వు, ఆవు కొవ్వు కలిసిందనే చంద్రబాబు ఆరోపణల్ని ఆరోపణల్ని ఎవరు జీర్ణంచుకో లేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీబీఐ నేతృత్వంలో సెట్ చాలా స్పష్టంగా జంతువుల కొవ్వు పదార్థాలు లడ్డూ ప్రసాదంలో కలవలేదని నివేదిక ఇచ్చిన విషయాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ మీడియాకు చదివి వినిపించారు. ఆ రిపోర్టు వచ్చిన తర్వాత చంద్రబాబు మరో నీచమైన వ్యాఖ్యలు చేస్తూ టాయిలెట్లు శుభ్రం చేసే రసాయనాలతో లడ్డూ ప్రసాదాలను తయారు చేశారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని ఉండవల్లి మండిపడ్డారు. అంబటి రాంబాబు విషయంలో కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. ఆయనకు ఒక కేసులో బెయిల్ రాగా, మరో కేసులో ఈ నెల 22వ తేదీ వరకు న్యాయ స్థానం రిమాండ్ విధించింది. రాజమహేంద్ర వరంలోని సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబును పోలీసులు సోమవారం గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. ఒక కేసులో బెయిల్ లభించినా మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయనను తిరిగి రాత్రి 7.30 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు.

**అంబటిపై ఆగని కుట్రలు**

నల్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించి అంబటి రాంబాబుకు బెయిల్ ఇచ్చిన స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్‌తో పాటు సౌకర్యాలు కోరుతూ రాంబాబు వేసిన ఎమినిటీస్ పిటిషన్‌లను తిరస్కరించారు. నల్లపాడు కేసులో బెయిల్ వస్తుందన్న ఉద్దేశంతో గతంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనపై పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో పెట్టిన కేసులో పీటీ వారెంట్‌పై సోమవారం రాజమండ్రి నుంచి గుంటూరు తీసుకొచ్చి ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది వక్కాల సూరిబాబు, మాజీ ఎంపీపీ మాతంగి శ్రీకాంత్, సహచర న్యాయవాదులు, వైయస్ఆర్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. బెయిలబుల్ సెక్షన్లతో ఉన్న కేసుల్లో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, అలాంటి సందర్భాల్లో అరెస్ట్, రిమాండ్ అవసరంపై కోర్టు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే ఈ కేసులో ఈ నెల 22 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా అంబటికి ఎట్టిపరిస్థితుల్లో బెయిల్ రాకుండా పాత కేసుల్లో పీటీ వారెంట్లు దాఖలు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతు న్నారు..

## నగరవాసులు మెచ్చే విధంగా సంప్రదాయ వధూ-వరుల జ్యువెలరీ ఎక్స్ పో

### వసుంధర డైమండ్ రూఫ్ ఎక్స్ పో ను ప్రారంభించిన ఎంపీ సతీమణి కేశినేని జానకి లక్ష్మీ



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని,విజయవాడ నగరంలో లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్ లో మంగళవారం వసుంధర డైమండ్ రూఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ వధూవరుల జ్యువెలరీ ఎక్స్ పో ను ముఖ్యఅతిథులుగా హాజరైన విజయవాడ ఎంపీ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్ పీతల సుజాత లతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఎక్స్ పో నిర్వహకులు ఈ ముగ్గురికి ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం ప్రత్యేక డిజైన్లతో ఆకర్షణీయంగా తయారు చేసిన వివిధ రకాల బంగారు ఆభరణానలను, వజ్రాభరణాలను వారు ఆసక్తి గా తిలకించారు. నిర్వహకులు ఆ అభరణాల ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా కేశినేని జానకీలక్ష్మీ మాట్లాడుతూ మహిళలకు బంగారు ఆభరణాలంటే ఎప్పుడూ ప్రత్యేకమైన ఇష్టం ఉంటుందన్నారు. కష్టమర్ల కు ఒకేచోట విభిన్న కలెక్షన్లను అందుబాటులో ఉండేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులకి అభినందనలు తెలిపారు.తనని ఈ కార్యక్రమానికి ఆహ్వానించటం చాలా సంతోషంగా వుందన్నారు. అమెరికాలో వసుంధర జ్యువెలరీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను కూడా సందర్శించటం జరిగిందన్నారు. గత 29 ఏళ్లుగా వసుంధర వారు మంచి నాణ్యత గల నగల తయారీలో విశేష అనుభవంతో ప్రజల ఆదరణ పొందుతున్నారని. ఇక్కడ ప్రదర్శించిన అన్ని నగలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.అలాగే తనకి వ్యక్తిగతంగా ట్రెడిషనల్ నగలంటే చాలా ఇష్టమని తెలిపారు. ప్రస్తుతం తగ్గిపోతున్న సంప్రదాయ పద్ధతుల్లో ఉన్న నగల తయారీని వసుంధర వారు కొనసాగించడం అభినంద నీయమన్నారు.. తెలంగాణలోని సాధారణ మహిళలు ధరించే సంప్రదాయ నగలు, పూసల గొలుసు వంటి ఆభరణాలను కూడా ఇక్కడ అందుబాటులో వుండటం చాలా ఆనందంగా వుందన్నారు. వసుంధర డైమండ్ రూఫ్స్ మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర మాట్లాడుతూ తమ సంస్థ హైదరాబాద్‌లో ప్రారంభించి 29 సంవత్సరాలు పూర్తయిందని, కష్టమర్ల ఆదరణతో దినదినాభివృద్ధి చెందిందని, అపూర్వమైన డిజైన్లు, నాణ్యత, వినియోగదారుల సంతృప్తే తమ సంస్థకు ప్రత్యేక గుర్తింపని తెలిపారు. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వసుంధర డైమండ్ రూఫ్స్ విజయవాడ షో రూమ్ హెడ్ అట్లూరి మేఘన తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి..

- పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు..
- ఓటర్లు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో
- తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి..
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10(వార్త సంధ్య) :** జిల్లాలో నేడు నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు 1,34,775 మంది ఓటర్లు, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు 16,850 మంది ఓటర్లు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని చెప్పారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,036 మంది ఇతర పోలింగ్ అధికారులు (రిజర్వ్‌తో కలిపి) నియమించామని చెప్పారు. అదేవిధంగా 48 మంది రిటర్నింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని, కౌంటింగ్ సిబ్బందిని ముందుగానే గుర్తించి అవసరమైన శిక్షణ అందించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి నోటిఫై చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, ఇల్లందు మున్సిపాలిటీకి సింగరేణి కమ్యూనిటీ హాల్ (24 ఏరియా), అశ్వారావుపేట మున్సిపాలిటీకి వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేటలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంగణాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. బ్యాలట్ బాక్సులు, బ్యాలట్ పేపర్లు సహా ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై పర్యవేక్షణ కోసం ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 31 జోనల్ అధికారులు, 8 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీలు) ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉన్నాయని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేడు పోలింగ్ జరిగే మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

## తంగడపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం రథోత్సవం

### స్వామివారి అలంకరణ అద్భుతం పదిపళ్లుగా అలంకరణ దాతగా ఎలిగేటి సురేందర్ రెడ్డి నిరంతర సేవలు



**చేవెళ్ల,ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ):** రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, తంగడపల్లి గ్రామంలోని దశావతార సహిత శ్రీ పద్మావతి అలమేలుమంగ సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్ర మహోత్సవం పురస్కరించుకుని మహా వైభవంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర భాద్రపద శుద్ధ త్రయోదశి . ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారి దర్శనంతో పరవశించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం ముందుగా శ్రీ విష్వక్సేనా ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం ఘనంగా జరిపి, అనేక నదీజలాలతో పాటు పంచామృతాలతో స్వామివారికి మహాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం అంతటా మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. యజ్ఞ కార్యక్రమాలు, ప్రత్యేక క్రతువులు శాస్త్రోక్తంగా సాగాయి. దశావతార సహితంగా, శ్రీ పద్మావతి అలమేలుమంగ సమేతంగా స్వామివారిని అద్భుతంగా అలంకరించడంతో భక్తులు కన్నుల పండుగగా దర్శించుకున్నారు. స్వామివారి దివ్య స్వరూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఆలయ ప్రాంగణమంతా “జై శ్రీమన్నా రాయణఽ శ్రీనివాస పరబ్రహ్మణే నమః” అనే నామస్మరణతో మార్మోగింది. భక్తులు దీపారాధనలు, హారతులతో స్వామివారిని సేవించారు. ఈ మహోత్సవంలో గత ఇరవై సంవత్సరాలుగా స్వామి వారికి అలంకరణ దాతగా నిరంతర సేవలందిస్తున్న ఎలిగేటి సురేం దర్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా



నిలిచారు. స్వామివారి సేవను తన జీవిత ధ్యేయంగా భావిస్తూ ఆయన చేస్తున్న సేవలను గ్రామస్తులు, భక్తులు ప్రత్యేకంగా కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా భక్తి భావంతో సేవలందిస్తున్న సురేందర్ రెడ్డి కుటుంబంపై స్వామివారి కృప ఎల్లవేళలా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమా లను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ నడాదూర్ వెంకట నాథాచార్యులు, శ్రీమాన్ నడాదూర్ శేషాద్రి చార్యులు, శ్రీమాన్ నడాదూర్ వేణుగోపాలచార్యులు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. వేద మంత్రాలతో, ఆగమ శాస్త్ర నియమాలను అను సరించి ప్రతి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో అలంకరణ దాత ఎలిగేటి సురేందర్ రెడ్డి ముందుకు సాగుతున్నారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈ మహా వైభవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తంగడపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ జన్మ నక్షత్ర మహోత్సవం భక్తి, సంప్రదాయం, సేవాభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలి చిందని భక్తులు అభిప్రాయపడ్డారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా, శాంతియుతంగా వర్ధిల్లాలని వారు ఆకాంక్షిం చారు.

## రంగారెడ్డి జిల్లాలో ఘనంగా ముఖ్యమంత్రి కప్202526 జిల్లా స్థాయి పోటీలు




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య) :** రంగారెడ్డి జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్202526 క్రీడా పోటీలు ఫిబ్రవరి 10, 2026న సరోర్నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో వాలీబాల్ మరియు బాక్సింగ్ విభాగాల్లో పోటీలు జరిగాయి.జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి 500 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఉత్కంఠభరితంగా సాగిన పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు మరియు పతకాలను నిర్వాహకులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మావతి (లీగల్ & ఎస్టేట్ ఆఫీసర్ వాయా+), ఈ. వెంకటేశ్వర్ రావు (డీవైఎస్ఓ) హాజరయ్యారు. అలాగే అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం రాఘవ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామచంద్రుడు, శ్రీ షబీర్, శ్రీ మల్లేష్, జిల్లా కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అందరి సమన్వయం, కృషితో ఈ జిల్లా స్థాయి పోటీలు అత్యంత విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు మరియు క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు.



**పోటీల ఫలితాలు :**

వాలీబాల్ (బాలురు): విజేతలు : కల్వకుర్తి నియోజకవర్గ జట్టు రన్నర్స్ : షాద్‌నగర్ నియోజకవర్గ జట్టు వాలీబాల్ (బాలికలు): విజేతలు : కల్వకుర్తి నియోజకవర్గ జట్టు రన్నర్స్ : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు ఈ జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ఇచ్ఛాపురం-నెల్లూరు రైల్వేలైన్ 4 వరుసలకు పెంపు!

**జోరందుకోనున్న సరకు రవాణా**

**బుల్లెట్ రైళ్ల కారిడార్లతో ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రయోజనం**

**774 రైల్వే క్రాసింగ్స్ తొలగించేలా వంతెనల నిర్మాణాలకు చర్యలు**



ఏ రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో నడవాలంటే అంతర్గత, బహ్య రవాణా వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతుల్లో మంచి ఫలాలందుతాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రవాణా సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు రవాణా సేవల్ని పునరుద్ధరించింది. సరకు రవాణా వేగంగా చేసేందుకు ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు ఉన్న రైల్వే లైన్లు 4 వరుసలకు పెంచితే మంచి అవకాశాలుండనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ అంశం గురించి మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 774 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ ఉన్నాయి. వాటిని తొలగించడం కోసం ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. వీటి నిర్మాణాలకు రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండదని, అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు పూర్తయ్యే లోపు నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూములు సేకరించేలా చూడాలని పేర్కొన్నారు. కలెక్టర్లు ఇది తమకు సంబంధం లేని విషయమని, లాజిస్టిక్ వ్యవహారం మాకెందుకు అని నిర్లక్ష్యం చేయకూడదని సీఎం హెచ్చరించారు.

**14 శాతం రవాణా ఖర్చే:** ఏ ఉత్పత్తికైనా ఎగుమతులకు అయినా రవాణా ఖర్చు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో చూసినట్లైతే ప్రస్తుతం ఉత్పత్తులకు సగటున 14 శాతం రవాణా ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. దీన్ని 7నుంచి 8 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.ఈ క్రమంలో కొత్త రైల్వే ప్రాజెక్టులపై దృష్టి సారించిన కేంద్రప్రభుత్వం హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా పనులు చేపట్టింది. చెన్నై - రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైళ్లు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులు చూస్తున్నారు.

**బుల్లెట్ రైళ్ల కారిడార్లు:** ఆంధ్రప్రదేశ్ మీదుగా బుల్లెట్ రైళ్ల కారిడార్లు ఏర్పాటైతే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఏపీ మీదుగా ప్రయాణించే బుల్లెట్ రైళ్లు ఇవే

హైదరాబాద్ - అమరావతి - చెన్నై

హైదరాబాద్ -బెంగళూరు,

చెన్నై- బెంగళూరు

**లాజిస్టిక్స్ తప్పనిసరి:** జలమార్గాలు అత్యుత్తమమైనవి. తర్వాత రైలు, ఆపై రోడ్లు భవిష్యత్తులో రాష్ట్రానికి ఎయిర్‌వేస్ వస్తాయని సీఎం అన్నారు. ఏటా దాదాపు 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి చేస్తుండగా, నాలుగైదేళ్లలో ఇది 1,000 లక్షల టన్నులకు వెళ్తుందని సీఎం తెలిపారు. దీన్నంతటినీ అంతర్జాతీయ మార్కెట్‌కు చేర్చేలా లాజిస్టిక్స్ సదుపాయం ఉండాలని ఆయన వివరించారు. అనంతపురం జిల్లా నుంచి రైళ్లలో అరటి రవాణా చేస్తున్నారు. ఇలా అన్ని పంటలపై దృష్టి పెట్టాలన్నారు. సీ ప్లేన్స్‌లో మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శం కానుందని చంద్రబాబు కోరారు.

## పార్లమెంటులో జరిగినదాన్ని చూసి యావత్ దేశం సిగ్గుపడుతోంది: కంగనా రనౌత్


**పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీరుపై కంగనా ఫైర్**

**విపక్షాలు అన్ని హద్దులు దాటాయని ఆరోపణ**

**రాహుల్ గాంధీ చర్యతో దేశం సిగ్గుపడుతోందని వ్యాఖ్య**

**ప్రధాని మోదీ భద్రతపై కంగనా ఆందోళన**

**సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసిరారని విమర్శ**



ప్రతిపక్షాలు అన్ని హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలతో దేశం మొత్తం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం నాడు పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె, విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం లోక్‌సభలో రాహుల్ గాంధీ.. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే ఇంకా ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. “రాహుల్ గాంధీ నిన్న ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టం చేసింది“ అని ఆమె తెలిపారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు.ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు కుట్ర చేస్తున్నాయని కంగనా ఆరోపించారు. “వారు సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసరడం, టేబుళ్లపైకి ఎక్కడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు ప్రధాని మోదీ చేతిలో నుంచి కాగితాలు లాక్కోరని, ఆయనపై దాడి చేయరని గ్యారెంటీ ఏంటి? ప్రధాని సభకు రావాలంటే మాకు దీనిపై హామీ కావాలి“ అని ఆమె డిమాండ్ చేశారు. మహిళా ఎంపీలను అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడితే పార్లమెంట్ గౌరవం ఏమవుతుందని ఆమె ప్రశ్నించారు.ఇదిలా ఉండగా, కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. “మాకు న్యాయం కావాలి“ అంటూ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.

## వేగంగా అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు & ప్రారంభోత్సవాలకు శ్రీకారం

**- జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి**



**హయత్‌నగర్,ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 10: :** వాగ్దానం కాదు, కార్యాచరణే మా రాజకీయ గుర్తింపని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడేలా, ఆయా స్థానిక కాలనీ వాసులతో కలిసి జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ & కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి అభివృద్ధి పనులకు ఘనంగా శంకుస్థాపనలు చేశారు. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, సంవత్సరాల తరబడి ఉన్న సమస్యలను శాశ్వత పరిష్కారాలు చేసిన ఘనత దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానిక నాయకులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు. శంకుస్థాపన & ప్రారంభోత్సవాలు చేసిన కాలనీలు & పనుల వివరాలు క్రింద పేర్కొనబడినవి:- చంద్రపురి కాలనీ,సి.సి రోడ్డు పనుల వ్యయం: ₹29.50 లక్షలు, ఇంప్రూవ్మెంట్ ఆఫ్ ఎల్బీనగర్ జంక్షన్ = ₹120.00 లక్షలు, స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ = 80.00 లక్షలు. శ్రీరామ్ నగర్ కాలనీ, ప్రజల భద్రత కోసం సి.సి కెమెరాల ప్రారంభోత్సవం ₹13.00 లక్షలు . సహారా స్టేట్స్ కాలనీ,సి.సి రోడ్డు & బి.టి రోడ్డు పనుల వ్యయం: ₹38.50 లక్షలు. కొలను శివారెడ్డి నగర్, పవనగిరి కాలనీ ఫేస్-3, బాలాజీ నగర్ ఎల్లారెడ్డి కాలనీ ఫేస్ -1, ఫేస్-2, నంది హిల్స్, వినాయక్ నగర్, ఎల్‌ఐసి కాలనీ = 31.00 లక్షలు. కెవియన్ రెడ్డి నగర్ సి.సి రోడ్ = ₹14.95 లక్షలు. మధురానగర్ భవాని నగర్ సిసి రోడ్ = ₹40.00 లక్షలు. అమ్మదయ కాలనీ కమిటీ హాల్ సౌకర్యాలు = ₹7.75 లక్షలు. సి.ఎస్.ఆర్ కాలనీ సిసి రోడ్డు= 46.50 లక్షలు. శివగంగ కాలనీ సిసి రోడ్ = ₹24.00 లక్షలు. వీరన్న గుట్ట రామాలయం సిసి రోడ్ = ₹27.00 లక్షలు. విష్ణు నగర్ నుండి ఆర్టీసీ సూపర్వైజర్ కాలనీ నుండి జాతీయ రహదారి వరకు = ₹98.50 లక్షలు. గ్రీన్ సిటీ కాలనీ, విష్ణునగర్, శివం హిల్స్, విజయనగర్, చండీశ్వర్ నగర్ = ₹96.00 లక్షలు. నంది హిల్స్ సిసి రోడ్= ₹84.00 లక్షలు. శ్రీకృష్ణ హిల్స్, కృష్ణానగర్ సిసి రోడ్= 31.00 లక్షలు. బొమ్మల గుడి రోడ్ దాదాపు 20 కాలములకు అనుసంధానం = 198.00 లక్షలు. వినాయక్ నగర్ కాలనీ లైబ్రరీ రోడ్ = 14.90 లక్షలు. మొత్తం కలిపి = 995.10 లక్షలు (9 కోట్ల 95 లక్షల 10 వేల రూపాయలు). ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కళ్లెం రవీందర్ రెడ్డి, ఆయా కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కొప్పుల ఉపేందర్ రెడ్డి, సయ్యద్ జానీ, కళ్లెం శంకర్ రెడ్డి, కడారి యాదగిరి, మాధవరెడ్డి, ప్రమోద్ రెడ్డి భాస్కర్, యాస శ్యాంసుందర్ రెడ్డి, సత్తిపండు, రవీందర్ రెడ్డి, సాయిలు గౌడ్, రమేష్, నరసింహ యాదవ్, వినోద్ కుమార్, మిరియాల రమేష్, డాక్టర్ నరసింహ, రమేష్ చారి, లక్ష్మారెడ్డి & సభ్యులు మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం: జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 ( వార్త సంధ్య ) :** ఫిబ్రవరి 11-02-2026 (బుధవారం) జరిగే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించే ప్రతి అధికారి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్నపాటి పొరపాట్లకు కూడా అవకాశం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మరియు ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ స్పష్టం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించి శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి అందజేస్తున్న ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్ట్ ప్రకారం ఎన్నికల సామగ్రిని పూర్తిగా పరిశీలించిన తరువాతనే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహించాలని అన్నారు. ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, గడువులోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ప్రతి ఓటరుకు సాయంత్రం 5 గంటల తర్వాత కూడా ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్



సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామగ్రిని ముందుగానే పోలింగ్ కేంద్రాల వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పక్కాగా అందించాలని సూచించారు. చెక్‌లిస్ట్ ఆధారంగా అవసరమైన సామగ్రి అందిందా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించిన కలెక్టర్, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. రీపోలింగ్‌కు ఎక్కడా అవకాశం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఓటింగ్ సమయంలో గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఓటింగ్ పూర్తైన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని తెలిపారు.అనంతరం శేరిగూడ మండల్ పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. మహేశ్వరం డీసీపీ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రెడిటేషన్ కార్డులు తగ్గిస్తే ఆందోళన తప్పదు

**-కేబుల్ చానళ్ళకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులివ్వాలి**

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్**

**-సమాచార భవన్ వద్ద కేబుల్ చానల్ జర్నలిస్టుల నిరసన**



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ చానళ్ళ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్ష, కక్షపూరిత చర్యలకు నిరసనగా అనేక మంది కేబుల్ చానల్ జర్నలిస్టులు మంగళవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం (సమాచార భవన్) ను ముట్టడి కార్యక్రమం నిర్వహించారు.మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 ను సవరించి కేబుల్ చానల్ జర్నలిస్టులకు పాత పద్ధతిలో అక్రెడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా బయలుదేరి కమీషనర్ కార్యాలయంలోకి దూసుకెళుతున్న జర్నలిస్టులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జర్నలిస్టులు ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించారు. దాదాపు రెండు గంటల పాటు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కేబుల్ చానళ్ళ ఆపరేటర్స్,జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ చానల్ వ్యవస్థ గ్రామీణ,పట్టణ ప్రాంతాలకు విస్తరించి, ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమాభివృద్ధి పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడంలో తమ వంతు కృషి చేస్తున్నాయని, అన్ని జిల్లాల్లో కేబుల్ ఛానల్ జర్నలిస్టులు నిరంతరంగా పనిచేస్తున్నారని అన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా విసిపి,వీసిఆర్ ఉన్న కాలం నుండి నేటిదాకా గ్రామీణ ప్రాంతాల నుండి, పట్టణాల దాకా కేబుల్ ద్వారా వార్తా ప్రసారాలను అందిస్తూ ముందుకు సాగుతున్నారని, శాటిలైట్ చానల్స్ లేనప్పుడే స్థానిక వార్తల సమాహారాన్ని ప్రజలకు సిటీ కేబుల్ రూపంలో అందించారని, గ్రామీణ ప్రాంత వార్తలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేసే విషయంలో ఇప్పటికీ కేబుల్ చానళ్ళ పాత్ర అగ్రభాగమే అని అన్నారు. అలాంటి కేబుల్ చానళ్ళకు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణ వచ్చిన తర్వాత జీవో 239 లో కొంత న్యాయం జరిగిందని,రాష్ట్రస్థాయిలో ఐఅండ్ పిఆర్ ద్వారా ప్రతి కేబుల్ ఛానల్ కు 12 అక్రెడిటేషన్ కార్డులు, జిల్లా స్థాయిలో ఆ చానల్ ప్రసారాలు ఉన్నట్లయితే నాలుగు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 252 లో రాష్ట్ర స్థాయిలో కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. 252 జీవో ద్వారా అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని తాము ఇప్పటికే పలు మార్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ ల దృష్టికి తీసుకువెళ్ళామని,ఇటీవల సచివాలయంలో జరిగిన సమావేశంలో కూడా జీవో 252 లో కేబుల్ చానళ్ళ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతున్న విషయాన్ని తాము ప్రస్తావించి జీవోను సవరించాలని కోరామని చెప్పారు. జీవోను నామమాత్రంగా సవరించి అందులో కొన్నింటికి సవరణలు చేస్తూ జీవో 103లో చేర్చారని, కానీ కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు మాత్రం ఈ సవరణ జీవోలో కూడా అన్యాయమే జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేబుల్ చానళ్ళకు విధించిన కొత్త నిబంధనలు సడలించి గతంలో మాదిరిగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కేబుల్ చానెల్స్ కు హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ లో ఐ అండ్ పీఆర్ ద్వారా 12 రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కార్డులు, కేబుల్ ఛానల్ ప్రసారాలు జరిగే ప్రతి జిల్లా కేంద్రంలో 4 అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో కేబుల్ చానళ్ళకు ఆఫీస్, స్టూడియో ఉండాలన్న నిబంధనను తొలగించాలని, సవరణ జీవోలో రాష్ట్ర, జిల్లా స్థాయి మీడియా అక్రిడిటెషన్ కమిటీలలో కేబుల్ చానల్స్ జర్నలిస్టుల నుంచి ఒక ప్రతినిధికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, రమణ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(టీఎస్ యూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, సంజీవ కుమార్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, కో-కన్వీనర్లు బ్రహ్మం, సంతోష్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొని కేబుల్ చానల్ జర్నలిస్టుల పోరాటానికి మద్దతు తెలిపారు. అనంతరం జాయింట్ యాక్షన్ కమిటీ, టీడబ్ల్యూజేఎఫ్ తరపున వేర్వేరుగా సమాచార పౌరసంబధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్ కు వినతి పత్రాలు ఇచ్చారు.



# బెల్లంముక్కతో ఎన్నో సమస్యలు దూరం

**వీటితో కలిపి తింటే సూపర్ బెనిఫిట్స్!**

**బీపీ, రక్తహీనత, అజీర్తి నెలసరి సమస్యలకు చెక్**

**విటమిన్లతో పాటు అనేక ఖనిజాలు పుష్కలం!**



జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే బెల్లం తినాల్సిందే! మలబద్ధకం సమస్య వేధిస్తోందా? దానికీ బెల్లమే పరిష్కారం! నెలసరి నొప్పులతో బాధపడుతున్నారా? బెల్లం ఉందిగా! ఇలా చెప్పుకుంటూ పోతే బెల్లం తింటే నయం కాని అనారోగ్యమంటూ ఉండదంటే అది అతిశయోక్తి కాదని నిపుణులు చెబుతుంటారు. అయితే ఈ బెల్లాన్ని నేరుగా కంటే కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపు అవుతాయంటున్నారు. ఫలితంగా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అజీర్తి దగ్గర నుంచి ఆకలిని అదుపు చేసే దాకా, నెలసరి సమస్యల్ని తగ్గించడం నుంచి చనుబాలు ఉత్పత్తి చేసే దాకా ఇలా ప్రతి ఒక్కటీ బెల్లంతో ముడిపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్లాన్ని ఏయే పదార్థాలతో కలిపి తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇప్పుడు తెలుసుకుందాం.బెల్లంలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బి-కాంప్లెక్స్, సి, డి 2, ఇ వంటి విటమిన్లు నిండి ఉన్న బెల్లాన్ని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని వెల్లడిస్తున్నారు. దీని వల్ల బీపీని అదుపు చేయడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం, నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడం, రక్తహీనతను తగ్గుతుందని వివరిస్తున్నారు.

## బెల్లం నెయ్యి

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి పొందచ్చు. బెల్లంంధని యాలు: ఇలా తీసుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నొప్పుల నుంచి విముక్తి పొందచ్చు. ఇంకా స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

## బెల్లం సోంపు

ఇది నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. అంతేకాకుండా దంతాలపై పాచి పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

## బెల్లం మెంతులు

ఇలా రెండు కలిపి తీసుకుంటే జుట్టు ఆరోగ్యం రెట్టింపు అవుతుంది. కుదుళ్లు దృఢంగా మారడమే కాకుండా.. తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

## బెల్లం గోంద్

ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుందని నిపుణులు అంటున్నార. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.

## బెల్లం అలీవ్ గింజలు

మనం తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ ఫుడ్ కాంబినేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందని వివరించారు.

## బెల్లం నువ్వులు

ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి దరిచేరకుండా కాపాడుతుంది.

## బెల్లంంపల్లీలు

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందని నిపుణులు అంటున్నారు.

బెల్లంంపసుపు: ఈ రెండూ కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు.

బెల్లంంశొంఠి పొడి: వీటిని కలిపి తినడం వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోవచ్చు. ఇంకా శరీరంలోని వాపును తగ్గించడానికి ఇది దోహదం చేస్తుంది.

# 'ఇవి తింటే యూరిక్ యాసిడ్ తగ్గిపోతుంది'

**బెస్ట్ రిజల్ట్స్ కోసం ఎప్పుడు తినాలి ?**

**ఈ 6 పదార్థాలు తీసుకుంటే యూరిక్ యాసిడ్ తగ్గతుందట!**

**ఎలా తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయో తెలుసా ?**

ఈ మధ్య కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగడం వల్ల నొప్పితో పాటు గౌట్, కిడ్నీలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో అనేక మందులతో పాటు ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు.. యూరిక్ యాసిడ్ స్థాయులను తగ్గేలా చేస్తాయని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటి వాటిని ఎప్పుడు, ఎలా తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.యూరిక్ యాసిడ్ఎలా ఏర్పడుతుంది.మనం రోజూ తీసుకునే ఆహారంలోని ప్రొటీన్ల నుంచి ప్యూరిన్ అనే రసాయనం విచ్ఛిన్నం చెంది యూరిక్ యాసిడ్‌గా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన యూరిక్ యాసిడ్ ఎప్పటికప్పుడూ మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. కానీ కొన్ని సందర్భాల్లో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉత్పత్తి కాగా, అంతే స్థాయిలో మూత్రం ద్వారా సరిగ్గా బయటకు వెళ్లనప్పుడు సమస్య వస్తుంది. యూరిక్ యాసిడ్ విసర్జన సరిగ్గా జరగక అది రక్తంలోని నిలిచిపోతుంది. అలా నిలిచిపోయిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోయి హైపర్? యూరిసిమియాకు దారి తీస్తుంది.



**వాల్ నట్స్ :** ఇందులో పుష్కలంగా ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వాపు, నొప్పిని తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా యూరిక్ యాసిడ్‌ను తొలగించి కిడ్నీ పనితీరును మెరుగపరచడంలోనూ సాయపడుతుందని వెల్లడిస్తున్నారు.2-3 వాల్ నట్స్‌ను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టాలి. అనంతరం పరగడుపునే తినవచ్చని లేదా స్మూతీలు, సలాడ్?తో పాటు తీసుకోవాలని చెబుతున్నారు.

**పిస్తా :** పిస్తాల్లో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుణాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఇవి యూరిక్ యాసిడ్, వాపు పెరిగేందుకు కారణమైన ఆక్సిడేటివ్ స్ట్రెస్‌తో పోరాడుతుందని వివరిస్తున్నారు. ఇంకా ఇందులోని ఆరోగ్యకరమైన పోషకాలు జీర్ణక్రియను మెరుగపరచడంలో సాయపడతాయని తెలిపారు.సుమారు 15 పిస్తాలను ఉదయాన్నే తినాలని చెబుతున్నారు. అయితే, వీటిని వేయించకుండా, ఎలాంటి ఉప్పు లేకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉప్పుతో తీసుకుంటే కిడ్నీ పనితీరుపై చెడు ప్రభావం చూపిస్తుందని తెలిపారు.

**బాదం :** బాదంలో జీర్ణక్రియను పెంచే, యూరిక్ యాసిడ్ లెవల్స్‌ను అదుపులో పెట్టే మెగ్నీషియం పోషకాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును పెంచుతుందని వివరిస్తున్నారు.5-6 బాదంను రాత్రి పూట నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటి పొట్టును తీసి ఖాళీ కడుపుతో తినాలని చెబుతున్నారు. అలా తినలేకపోతే మిక్సీ పట్టి పాలల్లో లేదా ఓట్ మీల్‌లో కలిపి తాగాలని అంటున్నారు.

**జీడిపప్పు :** మెగ్నీషియంతో పాటు హెల్దీ ఫ్యాట్ లభించే అద్భుతమైన పదార్థాల్లో జీడిపప్పు ఒకటి. ఇవి వాపును తగ్గించడంతో పాటు జీర్ణక్రియను పెంచడంలో సహాయ పడతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇందులో ప్యూరిన్స్ తక్కువగా ఉండడం వల్ల యూరిక్ యాసిడ్ అదుపులో ఉంటుందని వివరిస్తున్నారు. ఉదయాన్నే 4-5 జీడిపప్పులను ఎలాంటి ఉప్పు లేకుండానే తినాలని చెబుతున్నారు. వీలైతే ఇతర నట్స్‌తో తీసుకుంటే సమతుల పోషకాలు అందుతాయని తెలిపారు.

**డేట్స్ (ఖర్జూర) :** ఇందులో ఫైబర్, పొటాషియం లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రెండూ యూరిక్ యాసిడ్‌ను బయటకు పంపడంతో పాటు కిడ్నీ పనితీరును మెరుగుపరుస్తాయని అంటున్నారు. ఇంకా సహజంగానే శక్తిని పెంచేలా చేస్తుందని వివరిస్తున్నారు.ఉదయాన్నే 1-2 డేట్స్ నేరుగానే తినాలని లేదా స్మూతీలు, సలాడ్‌లో కలిపి తీసుకోవచ్చని చెబుతున్నారు.


**బ్రెజిల్ నట్స్ :** ఇందులో వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్న సెలీనియం పుష్కలంగా ఉంటుందని తెలిపారు. ఇంకా ఇది యూరిక్ యాసిడ్?ను బయటకు పంపి కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుందని వివరిస్తున్నారు.రోజూ 1-2 బ్రెజిల్ నట్స్ తినాలని.. అతిగా తింటే సెలీనియం శరీరానికి హానికరమని అంటున్నారు. ఉదయాన్నే నేరుగా లేకపోతే గ్రైండ్ చేసి తీసుకోవచ్చని చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# షుగర్ పేషెంట్లు ఈ 6 పండ్లను అసలు తినకూడదట!

**గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువుంటే షుగర్ లెవల్స్ పెరుగుతాయట!**

**ఇవి ఎక్కువగా ఉండే పండ్లు**

ప్రతి రోజు పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కానీ, మధుమేహంతో బాధపడే వారు మాత్రం పండ్లు తినాలంటే భయపడుతుంటారు. పండ్లలో చక్కెరస్థాయి ఎక్కువగా ఉంటుందని.. వాటిని తింటే రక్తంలో షుగర్ స్థాయులు పెరుగుతాయని భయపడుతుంటారు. ముఖ్యంగా కొన్ని పండ్లను తీసుకుంటే మాత్రం చక్కెర స్థాయులు పెరుగుతాయని



నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2002లో  అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది. ఈ నేపథ్యంలోనే ఆ పండ్లు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

మనం రోజూ తీసుకునే ఆహారంలో ఉండే కార్బోహైడ్రేట్స్ వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా రక్తంలో చక్కెర స్థాయి ఎంత మేర పెరుగుతుందో తెలిపే కొలమానాన్నే గ్లైసెమిక్ ఇండెక్స్ అంటుంటారు. తీసుకునే ఆహారంలో చక్కెర స్థాయి 55కు మించకుండా ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ అని, 56-69 మధ్య ఉంటే మధ్యస్థ, 70కి మించి ఉంటే అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌గా విభజిస్తుంటారు. అయితే, మధుమేహం ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తక్కువగా తింటే మంచిదని సలహా ఇస్తున్నారు. (రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

**పుచ్చకాయ :** వేసవిలో వచ్చే పుచ్చకాయలో అనేక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇందులో 72-80 వరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని.. ఫలితంగా ఎక్కువ షుగర్ స్థాయిలు ఉంటాయని తెలిపారు. అందుకే దీనిని వీలైనంత తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**అరటి:** సీజన్?తో సంబంధం లేకుండా ఉండే అరటిలో పండిన శాతం ఆధారంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని వెల్లడిస్తున్నారు. అరటి కాయలో 42-62 వరకు ఉంటుందని.. పండిన తర్వాత ఇంకా ఎక్కువగానే ఉంటుందని వివరిస్తున్నారు. అందుకే వీటిని తక్కువగా తినాలని సూచిస్తున్నారు.

**పైనాపిల్:** ఇందులో సహజసిద్ధమైన చక్కెరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. అందుకే తక్కువ మోతాదులో తినాలని సూచిస్తున్నారు.

**మామిడికాయ:** వేసవిలో మాత్రమే లభించే మామిడికాయ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం ఉంటుంది. దీంతో ఎక్కువగా తింటుంటారు. ఇందులో 51-60 గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుందని, ఫ్రక్టోజ్, సూక్రోజ్ శాతం సైతం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. చక్కెర స్థాయులు పెరగకుండా ఉండాలంటే దీనిని తక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**ద్రాక్ష:** ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగానే ఉంటుందని.. కానీ చిన్నగా ఉండడం వల్ల ఎక్కువగా తీసుకుంటామని అంటున్నారు. ఫలితంగా చక్కెర స్థాయులు పెరుగుతాయని చెబుతు న్నారు. అందుకే వీలైనంత తక్కువగా ద్రాక్షను తినాలని సూచిస్తున్నారు.

**చెర్రీలు:** చెర్రీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయులు రకరకాలుగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీలైనంత తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచ నలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఇవి తింటే స్ట్రోక్ వచ్చే ఛాన్స్ తక్కువట



మీకు 30 ఏళ్లు దాటాయా? అయితే మీరు తినే ఆహారంలో ఈ పదార్థాలు చేర్చుకుంటే మంచిదట! వీటిని మీ డైట్?లో జతచేసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువని నిపుణులు చెబుతున్నారు. మన జీర్ణవ్యవస్థకు మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని 18వ శతాబ్దంలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే వాటిపైన మరింత అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పరిశీలించారు. ఇందులో శరీరంలోని రెండు ప్రధాన భాగాలైన జీర్ణవాహిక, కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య పరస్పర కమ్యూనికేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రోబయాటిక్స్ గుణాలున్న ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి మెదడును రక్షిస్తుందని వెల్లడించారు.మరోవైపు జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా సంఖ్య పెరగడం వల్ల దీర్ఘకాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. 2025లో అనే అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే జీర్ణవ్యవస్థ, మెదడు మధ్య ఉన్న సంబంధంపై చైనాకు చెందిన ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేష్ సర్వేలోని డేటాను సేకరించి పరిశీలించారు. ఇందులో 20ఏళ్లు దాటిన వివిధ ప్రాంతాలు, వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న 48,677 మంది వివరాలు సేకరించారు. వీరికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచే అవకాడోలు, బ్రకోలీ, కాఫీ, శనగలు, క్రాన్?బెర్రీలు, డెయిరీ పదార్థాలు, సోయా, తృణధాన్యాలు ఆధారంగా ఎక్కువ స్కోర్లు ఇచ్చారు. దీంతో పాటు ప్రాసెస్ చేసిన ఆహారం, మాంసం తీసుకున్నవారికి తక్కువ స్కోర్లు ఇచ్చి విభజించారు. ఇందులో 20-29 ఏళ్ల మధ్య ఉన్నవారిలో ఎలాంటి మార్పులను గమనించలేదని పరిశోధకులు వెల్లడించారు. అదే 30 ఏళ్లు దాటినవారిలో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే.. స్ట్రోక్ వచ్చే అవకాశం తగ్గినట్లు కనిపెట్టారు. ముఖ్యంగా ఆకుకూరలు, వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారం తినేవారిలో స్ట్రోక్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువని తెలిపారు.మరోవైపు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని 2022లో అధ్యయనంలో తేలింది. జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల సమతుల్యంగా లేకపోవడం వల్ల హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇవన్నీ దీర్ఘకాలంలో స్ట్రోక్?కు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. అధిక రక్తపోటు, అధిక చక్కెర స్థాయుల, జీర్ణక్రియ సమస్యల వల్ల మెదడులో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

# రోజూ ఇవి వాడితే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ఛాన్స్

**పెయిన్ కిల్లర్స్ అతిగా వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్**

**కిడ్నీలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివే**



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఏర్పడే మలినాలు, శరీరంలో జరిగే జీవక్రియలో ఏర్పడే వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి ఆరోగ్యంగా ఉండేలా కిడ్నీలు సాయంచేస్తాయి. అయితే, ఇటీవల కాలంలో అనేక కారణాల వల్ల చాలా మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి కారణం సరైన ఆహారం తీసుకోకపోవడం, అధిక రక్తపోటు అని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూవారీ జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువుల వల్ల కూడా మన మూత్ర పిండాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.ఫెయిర్ నెస్ క్రీమలు: చాలా మంది ఉపయోగించే ఫెయిర్ నెస్ క్రీముల వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు. ఇందులో మెలనిన్ ఉత్పత్తిని అడ్డుకునేందుకు వాడే హానికారక మెర్క్యురీ అధికంగా ఉంటుందని.. దీనిని చర్మం గ్రహించడం వల్ల శరీరంలోకి చేరి కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం పాటు మెర్క్యురీతో కూడిన సౌందర్య ఉత్పత్తులను వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకోసమే ఇలాంటి ఉత్పత్తులు కొనేముందు అందులోని పదార్థాలను చూడాలని.. అవసరమైతే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు.

**హెర్బల్ సప్లిమెంట్లు :** హెర్బల్ సప్లిమెంట్లను పార్మా మందులకు ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు చాలా మంది. అయితే, వీటిపై నేచురల్, హెర్బల్ అని పెట్టినా సరే.. సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల కొన్ని ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు కలిపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఆర్సనిక్, లెడ్, మెర్క్యురీ వంటి విషపూరిత పదార్థాలను వాడడం వల్ల అవి శరీరంలో పేరుకుపోయి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. అందుకే హెర్బల్ ఉత్పత్తులను వాడే ముందు డాక్టర్లను సంప్రదించాలని.. మంచి పేరున్న బ్రాండ్ ఉత్పత్తులను వాడాలని సూచిస్తున్నారు.

**పెయిన్ కిల్లర్స్ :** మనలో చాలా మంది తల, కండరాల నొప్పులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా షాపునకు వెళ్లి పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. అయితే, ఈ మందులు స్వల్పకాలం నొప్పిని తగ్గించినా.. దీర్ఘకాలంలో అనేక ఇబ్బందులను తెస్తాయని నిపుణులు వెల్లడించారు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వీటిని తరచూగా తీసుకోవడం వల్ల కిడ్నీలకు రక్త సరఫరాను తగ్గి ఫలితంగా కిడ్నీలు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**గ్రీన్ టీ :** ప్రపంచంలోనే ఆరోగ్యకరమైన పానీయాల్లో గ్రీన్ టీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటుంటారు. కానీ, గ్రీన్ టీని ఎక్కువగా తాగడం వల్ల (రోజుకు అర లీటర్ కంటే ఎక్కువ) కిడ్నీలు ఫెయిల్ అవుతాయని మీకు తెలుసా? ఇందులో ఉండే ఆక్సలెట్స్.. క్యాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడేలా చేస్తాయని వెల్లడించారు. అలా అని మొత్తంగా గ్రీన్ టీని మానేయాల్సిన అవసరం లేదని.. కానీ ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని సూచిస్తున్నారు. మీకు ఇప్పటికే కిడ్నీలో రాళ్లు సమస్య ఉంటే తక్కువ మోతాదులో తాగాలని సలహా ఇస్తున్నారు.

**ప్రొటీన్ సప్లిమెంట్లు :** పోషకాహార లోపం ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ సప్లిమెంట్లను తీసుకుంటారు. కండరాలు పెరగడానికి చాలా మంది పౌడర్లు, షేక్స్ తీసుకుంటారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ప్రొటీన్లను ఫిల్టర్ చేసే బాధ్యత కిడ్నీలపై ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని ఫిల్టర్ చేయలేక కిడ్నీపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయని వివరించారు. అందుకే వీటిని మరీ ఎక్కువగా కాకుండా.. తగిన మోతాదులో తీసుకోవాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. హెయిర్ స్ట్రెయిటెనింగ్ ఉత్పత్తులు: కొంతమంది తరచూగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుంకుంటారు. ఇందుకోసం మార్కెట్లో దొరికే కొన్ని ఉత్పత్తులను వాడుతుంటారు. అయితే, ఇందులో ఉండే గ్లైయాక్సాలిక్ యాసిడ్ చర్మం ద్వారా శరీరంలోకి చేరి కిడ్నీలను దెబ్బ తీస్తాయని వెల్లడిస్తున్నారు.



# వాట్సాప్ వెబ్‌లో వాయిస్, వీడియో కాల్స్

**కొత్త ఫీచర్ వచ్చేసింది!**

**వాట్సాప్ వెబ్‌లో వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్ ప్రారంభం**

**ప్రత్యేక యాప్ లేకుండానే బ్రౌజర్ నుంచి కాల్స్ చేసుకునే వీలు**

**ప్రస్తుతానికి కొంతమంది బీటా యూజర్లకు మాత్రమే అందుబాటులోకి**

**కాల్స్‌కు కూడా ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ భద్రత**

**మొబైల్, డెస్క్‌టాప్ యాప్స్‌తో సమానంగా మారిన వెబ్ వెర్షన్**




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వెబ్ యూజర్ల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కీలక ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రత్యేకంగా డెస్క్‌టాప్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకోకుండానే నేరుగా వెబ్ బ్రౌజర్ నుంచే వాయిస్, వీడియో కాల్స్ చేసుకునే సదుపాయాన్ని ప్రారంభించింది. ఈ కొత్త అప్‌డేట్‌తో వాట్సాప్ వెబ్ వినియోగం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను దశలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ వారం ప్రారంభంలో కొంతమంది బీటా టెస్టర్లకు ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. మొబైల్, డెస్క్‌టాప్ యాప్‌లలో కనిపించే విధంగానే వాట్సాప్ వెబ్‌లోని వ్యక్తిగత చాట్‌లలో కూడా వాయిస్, వీడియో కాల్ ఐకాన్‌లు కనిపిస్తాయి. ఈ కాల్స్‌కు కూడా వాట్సాప్ అందిస్తున్న ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ భద్రత ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. దీనివల్ల సంభాషణలు పూర్తిగా గోప్యంగా ఉంటాయి. 2015లో ప్రారంభమైన వాట్సాప్ వెబ్ ఇన్నాళ్లూ కేవలం మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు పంపించుకోవడానికి మాత్రమే పరిమితమైంది. వాయిస్ లేదా వీడియో కాల్స్ చేయాలంటే తప్పనిసరిగా మొబైల్ ఫోన్ లేదా విండోస్, మ్యాక్ డెస్క్‌టాప్ యాప్‌లపై ఆధారపడాల్సి వచ్చేది. తాజా అప్‌డేట్‌తో ఈ ఇబ్బంది తొలగిపోయింది. వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు, స్నేహితులతో మాట్లాడటం వంటి వాటికి ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ద్వారా వాట్సాప్ వెబ్ వాడేవారికి ఈ ఫీచర్ ఎంతగానో ఉపయోగపడనుంది.

# పాన్ కార్డు నిబంధనల్లో భారీ మార్పులు
# ఏప్రిల్ 1 నుంచి కొత్త రూల్స్!

**ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 అమలు**

**పాన్ కార్డు వినియోగ నిబంధనల్లో కీలక మార్పులకు ప్రతిపాదన**

**బ్యాంకు డిపాజిట్లు, ఆస్తుల కొనుగోళ్లపై మారిన లావాదేవీల పరిమితులు**

**హోటల్ బిల్లులు, వాహనాల కొనుగోలుకు కొత్త పాన్ రూల్స్**

**ఫిబ్రవరి 22 వరకు ముసాయిదాపై అభిప్రాయాల స్వీకరణ**

దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దాదాపు ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025ను తీసుకువస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం పలు నిబంధనలను సులభతరం చేశారు. ముఖ్యంగా పాన్ కార్డు వినియోగానికి సంబంధించిన లావాదేవీల పరిమితుల్లో గణనీయమైన మార్పులు ప్రతిపాదించారు. ఈ కొత్త చట్టానికి సంబంధించిన ముసాయిదా నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే విడుదల చేసింది. వీటిపై ప్రజలు, నిపుణుల నుంచి ఈ నెల 22 వరకు అభిప్రాయాలను స్వీకరించనుంది. అనంతరం తుది నిబంధనలను, ఐటీ ఫారాలను ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేస్తుంది. ఈ ముసాయిదా ప్రకారం పలు ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి చేసే పరిమితులను సవరించారు.




కొత్తగా మారనున్న పాన్ నిబంధనలు ఇవే..

బ్యాంకు లావాదేవీలు: ప్రస్తుతం బ్యాంకులో ఒక్కసారి రూ. 50,000కు మించి నగదు డిపాజిట్ చేస్తే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంది. కొత్త నిబంధనల ప్రకారం, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షలు, అంతకుమించి మించి నగదు డిపాజిట్ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసినప్పుడు మాత్రమే పాన్ కార్డు వివరాలు సమర్పించాలి. వాహనాల కొనుగోలు: ఇప్పటివరకు ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల కొనుగోలుకు పాన్ తప్పనిసరిగా ఉండేది. కొత్త విధానంలో మోటార్ సైకిళ్లతో సహా ఏ రకమైన వాహనం కొనుగోలు చేసినా దాని విలువ రూ. 5 లక్షలు దాటితేనే పాన్ వివరాలు అందించాల్సి ఉంటుంది. స్థిరాస్తి క్రయవిక్రయాలు: ఏదైనా స్థిరాస్తిని అమ్మినా, కొనుగోలు చేసినా, బహుమతిగా ఇచ్చినా ఆ ఆస్తి విలువ రూ. 20 లక్షలు దాటినప్పుడే పాన్ వివరాలు అవసరం. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 10 లక్షలుగా ఉంది. ఇతర చెల్లింపులు: ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు లేదా బాంక్వెట్ హాళ్లలో చేసే చెల్లింపులు ఒకేసారి రూ. 1 లక్ష దాటితే పాన్ కార్డు వివరాలు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 50,000గా ఉంది. అలాగే, ఇన్సూరెన్స్ కంపెనీలో కొత్తగా ఖాతా తెరవాలంటే ప్రీమియంతో సంబంధం లేకుండా పాన్ తప్పనిసరి చేశారు. వీటితో పాటు కంపెనీలు తమ ఉద్యోగులకు అందించే ఉచిత భోజనం లేదా పానీయాల విలువ ఒక్కో మీల్‌కు రూ. 200 మించరాదని కూడా కొత్త చట్టంలో స్పష్టం చేశారు. ఈ మార్పుల ద్వారా పన్ను విధానంలో పారదర్శకత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పీఎఫ్ ఖాతాదారులకు గుడ్‌న్యూస్

**ఇక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్‌తోనే డబ్బులు విత్ డ్రా**

**త్వరలోనే కొత్త యాప్**

**ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం- యుపీఐ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు**

**క్లెయిమ్ దరఖాస్తుల బెడద ఇక ఉండదు- కొత్త మొబైల్ యాప్ ట్రయల్స్ షురూ**

**ఏప్రిల్ నుంచి అందుబాటులోకి**

దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) శుభవార్త చెప్పింది. అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పనిలేకుండా, ఇకపై క్షణాల్లోనే డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తేనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ సభ్యులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు.

**సరికొత్త యాప్, అద్భుతమైన ఫీచర్లు**

ప్రస్తుతం పీఎఫ్ సేవలు ఉమాంగ్ యాప్ లేదా యూఏఎన్ పోర్టల్ ద్వారా అందుతున్నాయి. కానీ రాబోయే కొత్త యాప్ పూర్తిగా దీనికోసమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ యాప్‌లో సభ్యులు తమ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పాస్‌బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా ఇందులో మరింత సులభంగా ఉంటాయి. పాత పద్ధతిలో క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి.

**ట్రయల్స్ మొదలయ్యాయి**

ఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి ఈపీఎఫ్ఓ ఇప్పటికే రంగంలోకి దిగింది. సుమారు 100 డమ్మీ ఖాతాలతో ప్రస్తుతం ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్‌లో ఈ యాప్‌ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.

**ఎంత డబ్బు తీసుకోవచ్చు?**

అయితే పీఎఫ్ ఖాతాలోని మొత్తం డబ్బును యూపీఐ ద్వారా తీసుకునే వీలుండదు. ఖాతాలోని కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తారు. అంటే అది భవిష్యత్తు అవసరాల కోసం ఉంటుంది. మిగిలిన పెద్ద మొత్తాన్ని మాత్రం సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా యూపీఐ ద్వారా వాడుకోవచ్చు. అనారోగ్యం, చదువు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకోవడం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.




**ప్రస్తుత సమస్యలు**

ఇప్పుడున్న విధానంలో పీఎఫ్ డబ్బులు రావాలంటే క్లెయిమ్ అప్లై చేయాలి. అది ప్రాసెస్ అయ్యి డబ్బులు రావడానికి సమయం పడుతుంది. ఏటా సుమారు 5 కోట్ల క్లెయిమ్స్ వస్తున్నాయి. వీటిని పరిష్కరించడం ఈపీఎఫ్ఓకు పెద్ద భారం. ఈ టైమ్ టేకింగ్ ప్రాసెస్‌ను తగ్గించడానికే కొత్త యాప్‌ను తెస్తున్నారు. దీనివల్ల సభ్యులకు సమయం ఆదా అవుతుంది, అధికారులకు పని భారం తగ్గుతుంది.

**ఆటో సెటిల్మెంట్ మోడ్**

ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో సెటిల్మెంట్ మోడ్ ద్వారా సేవలను వేగవంతం చేసింది. దీని ద్వారా మాన్యువల్ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ ద్వారా 3 రోజుల్లో క్లెయిమ్స్ పరిష్కారం అవుతున్నాయి. గతంలో దీని పరిమితి రూ.1 లక్షగా ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.5 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన ఈ విధానం ఇప్పుడు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోంది.

**బ్యాంకులతో పోటీగా**

ఈపీఎఫ్ఓకు బ్యాంకింగ్ లైసెన్స్ లేదు కాబట్టి నేరుగా ఏటీఎంలా డబ్బులు ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఈపీఎఫ్ఓ సేవలను బ్యాంకుల స్థాయికి తీసుకురావాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఈ యూపీఐ ఆధారిత విత్‌డ్రాయల్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. దేశంలోని దాదాపు 8 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు ఇది నిజంగానే ఒక శుభవార్త అని చెప్పవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# గూగుల్, చాట్‌జీపీటీలకు 'సర్వమ్ ఏఐ' సవాల్!

**గూగుల్ జెమిని, చాట్‌జీపీటీలను మించి పనిచేస్తున్న భారతీయ ఏఐ**


**సర్వమ్ ఏఐ నుంచి 'విజన్', 'బుల్ బుల్ ఎ3' అనే కొత్త మోడళ్లు**

**భారతీయ భాషల్లో డాక్యుమెంట్లు చదవడంలో 'విజన్' అత్యుత్తమ ప్రదర్శన**

**సహజమైన వాయిస్ అందించడంలో 'బుల్ బుల్' సత్తా**

**ఫిబ్రవరి 2026 వరకు ఉచితంగా ఏపీఐ సేవలు**

టెక్నాలజీ రంగంలో ఓ భారతీయ స్టార్టప్ సంచలనం సృష్టిస్తోంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'సర్వమ్ ఏఐ' సంస్థ, తాము అభివృద్ధి చేసిన కొన్ని ఏఐ మోడళ్లు భారతీయ భాషల విషయంలో గూగుల్ జెమిని, ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీ వంటి గ్లోబల్ దిగ్గజాలను మించి అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నాయని ప్రకటించింది. ఈ మేరకు 'సర్వమ్ విజన్', 'బుల్ బుల్ ఎ3' పేరుతో రెండు కొత్త ఏఐ మోడళ్లను ఆవిష్కరించింది. 'సర్వమ్ విజన్' అనేది భారతీయ భాషల్లోని డాక్యుమెంట్లను చదివి, విశ్లేషించగల ఒక శక్తిమంతమైన ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ మోడల్. ఇది హిందీ, తెలుగు, తమిళం సహా 22 అధికారిక భాషల్లోని పత్రాలను అధిక కచ్చితత్వంతో అర్థం చేసుకోగలదని సంస్థ తెలిపింది. మరోవైపు, 'బుల్ బుల్ ఎ3' అనేది టెక్ట్స్‌ను అత్యంత సహజమైన మానవ స్వరంలోకి మార్చే టెక్ట్స్-టు-స్పీచ్ మోడల్. ప్రస్తుతం ఉన్న గ్లోబల్ ఏఐ మోడళ్లు ఆంగ్ల భాషకే అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో, భారతీయ భాషల్లో వాటి పనితీరు తక్కువగా ఉంటోందని, ఆ లోటును భర్తీ చేయడానికే ఈ మోడళ్లను రూపొందించినట్లు సర్వమ్ ఏఐ సహ వ్యవస్థాపకులు డాక్టర్ వివేక్ రాఘవన్, డాక్టర్ ప్రత్యూష్ కుమార్ తెలిపారు. olmOCR`Bench మార్క్‌లో 'సర్వమ్ విజన్' 84.3 శాతం కచ్చితత్వం సాధించిందని పేర్కొన్నారు. అలాగే, టెలిఫోనీ ఆడియో నాణ్యతలో 'బుల్ బుల్ ఎ3' ఇతర పోటీ మోడళ్ల కన్నా మెరుగైన ఫలితాలు ఇచ్చిందని ఓ స్వతంత్ర అధ్యయనంలో తేలినట్లు వివరించారు. ఈ డాక్యుమెంట్ ఇంటెలిజెన్స్ ఏపీఐలు, విజన్ అనుభవాన్ని ఫిబ్రవరి 2026 వరకు ఉచితంగా అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం 11 భాషల్లో అందుబాటులో ఉన్న 'బుల్ బుల్'ను త్వరలో 22 భాషలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




# భారత్‌తో ట్రేడ్ డీల్‌పై వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్

**యూఎస్ వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై నో టారిఫ్స్!**

**అమెరికా నుంచి భారత్‌కు పశుగ్రాసం, ధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, పండ్లు**

**మద్యం, స్పిరిట్లుపై కూడా సుంకాల తొలగింపు లేదా తగ్గింపునకు భారత్ అంగీకారం**

**అమెరికా డిజిటల్ సేవలపైనా పన్నుల తొలగింపు**



భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంలో ఉండనున్న కీలక వివరాలతో వైట్‌హౌస్ సోమవారం అర్ధరాత్రి ఒక ఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం అమెరికాకు చెందిన అన్ని పారిశ్రామిక సరుకులతో పాటు చాలావరకు ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడాన్ని భారత్ చేస్తుంది. భారత్ నుంచి సుంకాల మినహాయింపు లేదా తగ్గింపును పొందే అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల జాబితాలో డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (పశుగ్రాసం), ఎర్ర జొన్న, డ్రై ఫ్రూట్స్, తాజా పండ్లు, ప్రాసెస్ చేసిన పండ్లు, పలు ధాన్యాలు, సోయాబీన్ ఆయిల్, మద్యం, స్పిరిట్లు ఉంటాయని వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో ప్రస్తావించారు. ఇంధన, ఐటీ, వ్యవసాయ, బొగ్గు, ఇతర రంగాల్లో కలుపుకొని అమెరికా నుంచి రానున్న ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్లకుపైగా విలువ చేసే వస్తు, సేవల కొనుగోలుకు భారత్ అంగీకరించిందని వైట్‌హౌస్ వెల్లడించింది.

**డిజిటల్ సేవల పన్ను లేదా?**

"అమెరికా కంపెనీలపై విధించే డిజిటల్ సేవల పన్నులను భారత్ తొలగిస్తుంది. అమెరికాతో డిజిటల్ వాణిజ్యానికి అవరోధంగా నిలుస్తున్న నిబంధనలు, విధానాలపైనా చర్చలకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎలక్ట్రానిక్ సిగ్నల్స్‌తో జరిగే డిజిటల్ డేటా బదిలీ, మెసేజ్‌ల బదిలీపై కస్టమ్స్ సుంకాల విధింపును భారత్ ఆపాలనే నిబంధన కూడా ట్రేడ్ డీల్‌లో ఉంటుంది. టెక్నాలజీ ఉత్పత్తులపరమైన వాణిజ్యాన్ని ఇరుదేశాలు గణనీయ స్థాయిలో పెంచనున్నాయి. టెక్నాలజీ ఉత్పత్తుల విషయంలో పరస్పర సహకారాన్ని భారత్, అమెరికా పెంచుకుంటాయి. వస్తు,ఉత్పత్తుల సప్లై చైన్ వ్యవస్థల బలోపేతం, పెట్టుబడుల ప్రవాహం, ఎగుమతి నియంత్రణలపై సమీక్షల ద్వారా ఇరుదేశాలు పరస్పర ఆర్థిక భద్రతకు పెద్దపీట వేస్తాయి" అని వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ పేర్కొంది.

**వాణిజ్య అవరోధాల తొలగింపు!**

"గతంలో అమెరికాపై ఏ దేశమూ విధించనన్ని సుంకాలను భారత్ విధించింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ సగటున 37 శాతం దిగుమతి సుంకాలను విధించేది. అమెరికా వాహన ఉత్పత్తులపై భారత్ సగటున 100 శాతానికిపైగా సుంకాలను విధించేది. ఆత్మరక్షణ వాద వాణిజ్య అవరోధాలను భారత మార్కెట్ కలిగి ఉండేది. దీని వల్ల చాలా వరకు అమెరికా వస్తు, ఉత్పత్తులకు భారత మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశమే లభించేది కాదు. ఈ వాణిజ్య అవరోధాలను తొలగించడంపై భారత్, అమెరికా త్వరలో చర్చిస్తాయి. ద్వైపాక్షిక వాణిజ్యానికి ఆటంకంగా నిలుస్తున్న సాంకేతిక, ప్రామాణిక అంశాలను సరళతరం చేయడంపైనా ఇరుదేశాలు చర్చలు చేస్తాయి. ఈ అన్ని వాణిజ్య అవరోధాలను తొలగించడంపై భారత్ దృష్టి పెడుతుంది" అని వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ తెలిపింది.

**ఒప్పందం ఖరారుపై త్వరలో కసరత్తు**

ఇటీవలే కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునే దిశగా రానున్న కొన్ని వారాల్లో భారత్, అమెరికా కసరత్తు చేస్తాయని వైట్‌హౌస్ తెలిపింది. భారత్, అమెరికాలకు పరస్పర ప్రయోజనాన్ని అందించేలా ఈ డీల్ ఉంటుందని స్పష్టం చేసింది. సేవా రంగం, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ, పెట్టుబడులు, కార్మిక- పర్యావరణ అంశాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రొక్యూర్‌మెంట్ ప్రమాణాలు వంటి మిగతా అంశాలపైనా ఇరుదేశాలు త్వరలో చర్చిస్తాయని పేర్కొంది. భారత్‌తో సమతూకమైన, పరస్పర ప్రయోజనాన్ని అందించే ఆచరణయోగ్య వాణిజ్యాన్ని చేసేందుకు అమెరికా సిద్ధమని వైట్‌హౌస్ చెప్పింది. ఫిబ్రవరి నెల ప్రారంభంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య అత్యున్నత స్థాయి ఫోన్ కాల్ సంభాషణ జరిగింది. అనంతరం ఫిబ్రవరి 7న వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. తాజాగా దీనిపైనే ఫ్యాక్ట్ షీట్‌ను వైట్‌హౌస్ రిలీజ్ చేసింది.

**రష్యా చమురు కొనుగోలు ఆపేస్తుంది!**

"గత శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ప్రకారం అమెరికా వస్తు,ఉత్పత్తుల కోసం 140 కోట్ల మందితో కూడిన భారత మార్కెట్ తెరుచుకుంటుంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేందుకు భారత్ అంగీకరించింది. ఇందుకు ప్రతిగా భారత్‌పై విధించిన 25 శాతం సుంకాన్ని తొలగించేందుకు ప్రెసిడెంట్ ట్రంప్ అంగీకరించారు. దీనిపై గత శుక్రవారమే ట్రంప్ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో అమెరికా ఎదుర్కొంటున్న లోటును పూడ్చే విషయంలో సహకారాన్ని అందించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకు ప్రతిగా భారత వస్తు, ఉత్పత్తులపై విధించే సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గించింది. జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొనే విషయంలోనూ భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయి" అని ఫ్యాక్ట్ షీట్‌లో వైట్‌హౌస్ ప్రస్తావించింది.

## అది మాకు చిన్న సంఖ్య- అమెరికా నుంచి రూ.45లక్షల కోట్ల సరుకులను కొనడం సమస్యే కాదు


రానున్న ఐదేళ్లలో అమెరికా నుంచి రూ. 45.29 లక్షల కోట్లు (500 బిలియన్ డాలర్లు) విలువైన వస్తు, ఉత్పత్తులను కొనడం అనేది భారత్‌కు సమస్యే కాదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. వాస్తవానికి అది చాలా చిన్న సంఖ్య అని, అమెరికాకు రూ. 1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు) గిరాకీని అందించే సామర్థ్యం వికసిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఏటా వివిధ ప్రపంచ దేశాల నుంచి రూ. 27.17 లక్షల కోట్లు (300 బిలియన్ డాలర్లు) విలువైన వస్తు, ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంటోందని పీయూష్ గోయల్ చెప్పారు. భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్తున్న ఈ ఆర్డర్ల విలువ రానున్న ఐదేళ్లలో రూ. 1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు)కు పెరుగుతుందని తాను అమెరికా వాణిజ్య శాఖ మంత్రి, అధికార వర్గాలకు వివరించానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ అమెరికా వస్తు, ఉత్పత్తులు సరైన ధరలకు లభిస్తే, ఈ ఆర్డర్లన్నీ దాని వైపుగా మళ్లుతాయని చెప్పానన్నారు. తాజాగా ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చలతో ముడిపడిన కీలక వివరాలను పీయూష్ గోయల్ వెల్లడించారు.

**ఆ ఒక్క రంగం నుంచే భారీగా ఆర్డర్స్!**

"ఇప్పటికే ఏటా అమెరికా నుంచి 45 నుంచి 50 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను భారత్ కొంటోంది. అవన్నీ మన దేశంలో తయారు కాని సరుకులే. రానున్న ఐదేళ్లలో తమ నుంచి 500 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను కొనాలని భారత్‌ను అమెరికా కోరింది. వాస్తవానికి భారత్‌కు అది చాలా చిన్న సంఖ్య. త్వరలోనే భారత్‌లో 10 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. వాటికి అవసరమైన పరికరాలను మనకు అమెరికా సప్లై చేయొచ్చు. భారత్‌కు విమానాలు, విమాన ఇంజిన్లు, విమాన విడిభాగాలు కావాలి. అవన్నీ మనకు అమెరికా అమ్మొచ్చు. ఇప్పటికే చాలా విమానాలు, విమాన ఇంజిన్ల కోసం అమెరికాకు భారత్ ఆర్డర్లు ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న ఈ ఆర్డర్ల విలువే 90 బిలియన్ డాలర్ల దాకా ఉంటుంది. విమానాల కోసం అమెరికాకు మరిన్ని ఆర్డర్లు ఇవ్వాలని టాటా గ్రూప్ అనుకుంటోందని నేను విన్నాను. ఈ లెక్కన రానున్న ఐదేళ్లలో భారత విమానయాన రంగం నుంచే అమెరికాకు 100 బిలియన్ డాలర్లకుపైగా ఆర్డర్లు లభిస్తాయి. ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పీజీ విభాగాల్లోనూ అమెరికాకు భారత్ ఆర్డర్లను ఇవ్వగలదు. భారత్‌లోని స్టీల్ పరిశ్రమల కోసం అమెరికా నుంచి బొగ్గును తెప్పించుకోవచ్చు. ప్రస్తుతం ఏటా 18 బిలియన్ టన్నుల బొగ్గును అమెరికా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఏటా అమెరికా నుంచి 30 బిలియన్ డాలర్లు విలువైన బొగ్గును కొనే కెపాసిటీ భారతదేశ స్టీల్ పరిశ్రమకు ఉంది" అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వివరించారు.

**కాంగ్రెస్ కాలం నుంచే!**

"విమానాలు, బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పీజీ వంటి వాటిని కాంగ్రెస్ కాలం నుంచే మనకు అమెరికా సప్లై చేస్తోంది. యూపీఏ సర్కారు హయాంలోనూ ఈ వస్తు, ఉత్పత్తులను మనం అమెరికా నుంచి కొన్నాం. ఇందులో కొత్త విషయమేం లేదు. నాటికి, నేటికి వస్తు, ఉత్పత్తుల డిమాండ్ పెరిగింది అంతే. ప్రస్తుతం అన్ని రంగాల్లో వీటన్నింటి వినియోగం పెరిగింది. ఇప్పుడు భారత ప్రభుత్వం ఏఐ మిషన్‌తో ముందుకు సాగుతోంది. ఇందుకోసం అరుదైన ఖనిజ నిక్షేపాల తయారీ, ప్రాసెసింగ్‌పై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయాలంటే అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన ప్రత్యేక యంత్రాలు, ఐసీటీ ఉత్పత్తులు, ఎన్‌వీడియా చిప్‌లు, క్వాంటమ్ కంప్యూటింగ్ మెషీన్స్ కావాలి. ఇవన్నీ మనకు ఎక్కడి నుంచి వస్తాయి? టెక్ ఉత్పత్తుల సప్లైలో అమెరికాయే అత్యంత శక్తివంతంగా ఉంది. అందుకే ఏటా 100 బిలియన్ డాలర్ల వ్యాపార ఆర్డర్లు ఇవ్వాలని అమెరికా పెట్టిన నిబంధన, భారత్‌కు చాలా ఈజీ. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే లక్ష్యంతో ఉన్న భారత్ ఎదుట అమెరికా పెట్టిన టార్గెట్ చాలా చిన్నది" అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.




## 'గాయపడ్డ సింహం' ట్రైజర్ రిలీజ్.. తరుణ్ భాస్కర్ కొత్త అవతారంలో..!

నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్‌కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన "ట్రైజర్" ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తేడ అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది. వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ ద్వారా అర్థమవుతోంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. క్యాప్షన్ ద్వారా చిత్ర బృందం కథలో ఉన్న అంతర్గత భావాన్ని స్పష్టంగా చెప్పింది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. దర్శకుడిగా ఇప్పటికే విజయాలు అందుకున్న తరుణ్ భాస్కర్‌కు నటుడిగా ఈ సినిమా ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి. వినోదంతో పాటు సమాజంలోని యువత సమస్యలను టచ్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



## కన్నడ చిత్రసీమలోకి మీనాక్షి చౌదరి ఎంట్రీ?

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి, కన్నడ చిత్రసీమలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రక్షిత్ శెట్టి నటించిన సూపర్ హిట్ చిత్రం '777 చార్లీ' సీక్వెల్‌లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం మీనాక్షి నాగచైతన్యతో 'వృషకర్మ'తో పాటు మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. తన పట్టుదలతో, సరైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ మీనాక్షి రాబోయే రోజుల్లో ఇతర ఇండస్ట్రీల్లోనూ తన సత్తా చాటుతుందని అభిమానులు నమ్ముతున్నారు. ఇటీవల కాలంలో తెలుగులో మీనాక్షి వరుస హిట్లతో దూసుకుపోతోంది. ముఖ్యంగా 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', ' సంక్రాంతికి వస్తున్నాం ' వంటి చిత్రాలు ఆమె ఖాతాలో భారీ విజయాలుగా నిలిచాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మీనాక్షి క్రేజ్ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లిందని చెప్పొచ్చు.

## బుల్లిరాజు కొత్త సినిమా.. పవర్‌ఫుల్‌గా టీజర్



అనన్య శర్మ, ఎస్ కృష్ణ ప్రధాన పాత్రల్లో వస్తోన్న లేటెస్ట్ మూవీ హై. ఈ సినిమాకు ఎస్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇమేజ్‌స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ బ్యానర్లపై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టాలీవుడ్ హీరో విక్టరీ వెంకటేశ్ చేతుల మీదుగా ఈ టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే యూత్‌ఫుల్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో సన్నివేశాలు క్రైమ్ స్టోరీని తలపించేలా ఉన్నాయి. సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు(రేవంత్) ఈ టీజర్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా కనిపించాడు. కాగా.. ఈ సినిమాలో రేవంత్ (బుల్లిరాజు), పల్లవి దొర, కృష్ణ కమల్, సాయికృష్ణ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వికాస బాదిసా సంగీతమందిస్తున్నారు.

## మరోసారి భయపెట్టబోతున్న ఆది సాయికుమార్!




'శంబాల' చిత్రంతో రీసెంట్‌గా ఆది సాయి కుమార్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. మరోసారి అద్భుతమైన కథతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆది సాయికుమార్ హీరోగా, గ్లామరస్ హీరోయిన్ వేదిక హీరోయిన్‌గా నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'జంగిల్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సరికొత్త కథనం, ఒళ్లు గగుర్పొడిచే నేపథ్యం, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందింది అని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ చిత్రాన్ని ఫ్రైడే పిక్చర్స్ బ్యానర్ మీద రాఘవ రెడ్డి పబ్బతి ప్రతిష్టాత్మకంగా తెలుగులో విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. థియేట్రికల్, శాటిలైట్, డిజిటల్ రైట్స్‌తో పాటు అన్ని హక్కులను ఫ్రైడే పిక్చర్స్ స్వాధీనం చేసుకోవడం విశేషం. అతి త్వరలోనే గ్రాండ్ రిలీజ్ ప్లాన్ చేస్తోంది టీం. ప్రస్తుతం 'జంగిల్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఫైనల్ వీఎఫ్ఎక్స్ వర్క్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మూవీలో ఆది సాయికుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే వేదిక పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. హారర్‌తో పాటు సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రేక్షకులను చివరి వరకు కట్టిపడేస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ట్రైలర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇకపై కంటిన్యూగా అప్డేట్‌లను ఇస్తామని టీం చెబుతోంది.



## ఫైనల్‌గా సెట్స్ మీదకు హనుమాన్ 2!

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'హనుమాన్ 2'. ఈ సినిమాపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. ప్రేక్షకులు అండ్ సినీ లవర్స్‌లో హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. అలాగే హనుమంతుడిగా రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా నెట్టింట్ సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇదిలా ఉంటే.. ఈ మధ్య కాలంలో హనుమాన్ 2 నుంచి ఒక్క అప్డేట్ కూడా రాకపోవడంతో అసలు ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలోనే తాజాగా అదిరిపోయే బజ్ నెట్టింట సందడి చేస్తుంది. చాలా గ్యాప్ తర్వాత ప్రశాంత్ వర్మ 'హనుమాన్2' సినిమాను లాక్ చేసినట్లు తెలుస్తుంది. మార్చి నుండి షూటింగ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తుండగా.. వచ్చే ఏడాది గ్రాండ్ పాన్-ఇండియా విడుదలకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## ధనుష్‌తో ప్రేమాయణం .. మృణాల్ ఠాకూర్‌పై మరో హీరో పూల వర్షం.. !

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉండడం మనం చూస్తూ ఉన్నాం. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్‌తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రమోషన్‌లకు అతీతంగా కూడా కలిసి కనిపించారనే వార్తలు రావడంతో ఊహాగానాలు మరింత పెరుగుతున్నాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ తెలుగు, హిందీ భాషల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మృణాల్ వ్యక్తిగత జీవితం, కెరీర్ రెండూ కూడా వార్తల్లో నిలుస్తున్నాయి.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.